


ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందుకున్న అనంతరం 'థ్యాంక్యూ చంద్రబాబు' అని రాసిన ప్లకార్డును ఇంటి గోడకు కట్టుకుంటున్న వృద్ధురాలు (ఫైల్)

మార్చేశారు..

- పథకాల పేర్లు మారిపోయాయి
- వాటికి తిరిగి పాత నామకరణాలు
- జగనన్న పోయి అంబేడ్కర్ వచ్చే!
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- గత వైసీపీ పాలనలో రంగులు, పేర్ల పిచ్చితో అంతా అడ్డగోలే
- సరిచేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం

రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల పేర్లను మార్చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటిదాకా రాష్ట్రంలో అమలులో ఉన్న ప్రతి పథకం పేరునూ ఇష్టారీతిన మార్చి కొత్తపేర్లు పెట్టింది. పేదలకు పింఛన్‌ల పంపిణీ, బడుగు విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్పులు, కల్యాణమస్తు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు ఇచ్చే పోషకాహారం వంటి అన్ని రకాల సంక్షేమ పథకాలకు పేర్లు మార్చేసింది. అంబేడ్కర్ విదేశీ విద్య పథకం పేరు తొలగించి ఏకంగా వైసీపీ అధినేత జగన్ పేరు పెట్టుకోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే ఆ పేర్లన్నీ ప్రస్తుతం మారిపోయాయి.



ఒంగోలు నగరం, జూలై 6 : ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ప్రజలు జగన్ సర్కార్‌కు తగిన గుణపాఠం చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే తీర్పు ఇలాగే ఉంటుందని స్పష్టం చేశారు. వైసీపీ ఘోర ఓటమికి రంగులు, పేర్ల పిచ్చి కూడా ఒక కారణమే. కాగా కూటమి ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే సంక్షేమ పథకాల అమలుపై దృష్టిపెట్టింది. అయితే గత ప్రభుత్వం పథకాల పేర్లను ఇష్టారీతిన మార్చివేసిన విషయం తెలిసిందే. ఎంతోకాలంగా ఎన్టీఆర్ పేరుతో ఉన్న ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరును కూడా వైఎస్సార్ పేరుతో వైసీపీ ప్రభుత్వం మార్చేసింది. అంతెందుకు ప్రపంచ మేధావి అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో నాటి తెలుగుదేశం పార్టీ అమలు చేసిన అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం పేరును జగనన్న విదేశీ విద్య పేరుగా మార్చేసి మరింత బరితెగించింది. రాష్ట్రంలోని కోట్లాది మంది దళితుల మనోభావాలను దెబ్బతీసింది.

తిరిగి 'వెలుగు'గానే..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వెలుగు-డీఆర్‌డీఏ పేరును కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరక్రాంతి పథకం అని, వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ క్రాంతిపథం అని పేర్లు మార్చేసి అమలు చేశాయి. అయితే ఏ ప్రభుత్వం వచ్చినా ఎన్ని పేర్లు పెట్టినా వాడుకలో దీన్ని వెలుగు అనే పేరుతోనే పిలుస్తున్నారు. కాగా వెలుగు ద్వారా పొదుపు సంఘాల మహిళలకు సున్నావడ్డీ పథకం, రుణమాఫీ, జగనన్న ఆసరా, జగనన్న తోడు, చేదోడు వంటి పథకాలు అమలవుతున్నాయి. కాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వెలుగుగా ఈ శాఖకు పేరు మార్చుతూ ఇంతవరకు ఉత్వర్వులు వెలువడలేదు. త్వరలోనే వచ్చే అవకాశం ఉందని అధికారులు బావిస్తున్నారు. విద్యాశాఖ ద్వారా అమలవుతున్న అమ్మఒడి, నాడు-నేడు వంటి పథకాలు, ఇవి కాక ఆటో కార్మికులకు ఇచ్చే ఆర్థిక సహాయం పథకం, వీధి వ్యాపారులకు ఇచ్చే ఆర్థిక సహాయం అందించే పథకాల పేర్లు కూడా రూపుమారనున్నాయి.

ఇక అంబేడ్కర్ విదేశీ విద్య..

గత నెలలో రాష్ట్రంలో అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల పేర్లను పూర్తిగా మార్చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఎంతోకాలంగా అంబేడ్కర్ పేరుతో అమలైన విదేశీ విద్య పథకానికి జగనన్న పేరును తొలగించి తిరిగి పాత పేరుతోనే అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో పేదలకు పింఛన్లు అందించే పథకాన్ని వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుక పేరుతో అమలుచేయగా ప్రస్తుత ప్రభుత్వం గతంలో ఈ పథకానికి ఉన్న ఎన్టీఆర్ భరోసా పేరును పునరుద్ధరించింది. ఈ పథకం కింద జిల్లాలోని దాదాపు రెండున్నర లక్షలమంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు నెలవారీ పింఛన్లు పొందుతున్నారు. ఈ పథకాన్ని ఇక నుంచి ఎన్టీఆర్ భరోసా పేరుతోనే అమలు చేయనున్నారు.

బడుగు విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్పులు, మెస్ చార్జీలు చెల్లించే పథకాలు ఇప్పటి వరకూ జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పేర్లతో అమలయ్యాయి. ఇప్పుడు వాటిని పోస్టు మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్పు అనే పేర్లతో అమలు చేయబోతున్నారు. అదేవిధంగా పేద జంటలు వివాహం చేసుకుంటే వారికి అందించే ఆర్థిక సహాయానికి వైఎస్సార్ కల్యాణమస్తు పేరుతో గత ప్రభుత్వం అమలు చేయగా, ఇప్పుడు ఈ పథకానికి చంద్రన్న పెళ్లికానుక పేరు పెట్టారు.

పెళ్లికానుక, బాలసంజీవని..

దేశంలోనే అత్యున్నత సర్వీసులైన సివిల్ సర్వీసు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించే పథకానికి గత ప్రభుత్వం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పేరుతో అమలు చేయగా ఇప్పుడు ఈ పథకానికి ఇన్‌సెంటివ్స్ ఫర్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్ పేరుతో అమలు చేయనున్నారు. స్త్రీశిశు సంక్షేమశాఖ ద్వారా అమలు జరుగుతున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలు బాలసంజీవని పథకంగా మార్చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

అందుబాటులోకి ఇసుక

- టన్ను రూ.247
- ఒంగోలు, చతుకుపాడు నుంచి తీసుకెళ్లవచ్చు

జరుగుమల్లి (కొండపి)/ఒంగోలు క్రైం, జూలై 6 : ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం జిల్లాలోని ఒంగోలు మార్కెట్ యార్డు, జరుగుమల్లి మండలం చతుకుపాడులో ఉన్న రెండు స్టాక్ పాయింట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియాతోపాటు అధికారులు సందర్శించారు. మూడు ప్రాంతాల్లో 42,833 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు గుర్తించారు. అదేసమయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్, భూగర్భ గనులశాఖ ప్రధాన కార్యదర్శి ఎన్.యువరాజు, కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌లు జిల్లా అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ తమీమ్ అన్సారియా అధ్యక్షతన జరిగింది. ఇసుక అవసరమున్న వినియోగదారులు ఒంగోలులోని మార్కెట్ యార్డు, చతుకుపాడుల్లో ఎక్కడి నుంచైనా టన్నుకు రూ.247 చెల్లించి తీసుకెళ్లవచ్చన్నారు. సొంత రవాణా ఖర్చులతో తరలించుకోవచ్చని తెలిపారు. ఇసుక రవాణాను ఎస్ఈబీ, రెవెన్యూ, పోలీసు శాఖలు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, జిల్లా మైనింగ్ అధికారి బి.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.



చతుకుపాడు డంప్ వద్ద ఇసుక నిల్వ వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ అన్సారియా

ఇసుక డంప్‌లను పరిశీలించిన కలెక్టర్

జరుగుమల్లి మండలం చతుకుపాడు సమీపంలోని పొలాల్లో ఉన్న రెండు ప్రభుత్వ ఇసుక డంప్‌లను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా శనివారం పరిశీలించారు. అక్కడి ఇసుక నిల్వ వివరాలను తెలుసుకున్నారు. ఈ ఇసుకను హౌసింగ్ పథకంలో పేదల ఇళ్లకు సరఫరా చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అడ్డగోలుగా ప్రైవేటు వ్యక్తులు తరలించుకువెళ్లారు. తాజాగా పరిశీలించిన కలెక్టర్ ఇసుక అక్రమంగా తరలిపోకుండా కట్టడి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట జేసీ ఆర్.గోపాలకృష్ణ, మైనింగ్ డీడీ జగన్నాథ రావు, తహసీల్దార్ చక్రవర్తి, ఎస్ఈబీ, మండల అధికారులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అలర్ట్

- వైద్యశాఖకు ప్రభుత్వం సూచన
- గత నెలలో జిల్లాలో ఐదు డెంగ్యూ కేసులు నమోదు

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 6 : జిల్లాలో సీజనల్ వ్యాధులపై వైద్యశాఖను ప్రభుత్వం అప్రమత్తం చేసింది రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. తదనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో వైద్యశాఖ అధికారులు కదిలారు. ఇప్పటికే జిల్లాలోని అనేక ప్రాంతాల్లో డయేరియా, డెంగ్యూతోపాటు పలురకాల సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో గత నెలలో ఐదు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. అందులో జిల్లాకేంద్రమైన ఒంగోలులోనే మూడు ఉన్నాయి. చీమకుర్తిలో ఒకటి, అర్ధవీడులో ఒక కేసు వెలుగు చూసింది. దీంతో అధికారులు ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. డెంగ్యూ ప్రబలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నారు. వర్షాకాలంలో దోమల వల్ల వచ్చే వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలక అవగాహన కల్పించనున్నారు.



కట్టకు సమీపంలో విచ్చలవిడిగా చేసిన తవ్వకాలు

చెరువులను మింగేస్తున్నారు!

- యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు
- భారీ యంత్రాల వినియోగం
- కాంట్రాక్టర్‌కు పెద్దల అండదండలు
- పట్టించుకోని అధికారులు

పొదిలి, జూలై 6 : పొదిలి ప్రాంతంలో సువిశాలంగా ఉండే చెరువులపై అక్రమార్కుల కన్ను పడింది. అందినకాడికి చెరువు మట్టిని తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకు భారీ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇతర జిల్లా నుంచి ఇక్కడకు వచ్చిన కాంట్రాక్టర్‌కు పెద్దల అండదండలు పుష్కలంగా ఉండటంతో పట్టించుకునే వారు కరువయ్యారు. ఫలితంగా చెరువులు రూపురేఖలు కోల్పోయి ప్రమాదకరంగా మారాయి. ఇంత జరుగుతున్నా యంత్రాంగం ఇంకా నిద్రావస్థ నుంచి మేలుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పొదిలి పట్టణంలోని చిన్నచెరువు, రాజుపాలెం చెరువుల్లో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దశాబ్దకాలంగా ఈ ప్రాంతాల్లో సరైన వర్షాలు లేకపోవడంతో చెరువులన్నీ ఖాళీగా ఉండటం వారికి వరంగా మారింది. ఆ చెరువుల్లో యంత్రాలతో అక్రమార్కులు తీసిన గుంతలను చూస్తుంటే చీమకుర్తి గ్రానైట్ క్వారీలు గుర్తొస్తాయంటే అతిశయోక్తి కాదు. చిన్నచెరువు విస్తీర్ణం సుమారు 101ఎకరాలు ఉంది.



తవ్వకాలకు ముందు చిన్నచెరువు (ఫైల్)

నామమాత్రపు సీనరేజీతో తవ్వకాలు

నామమాత్రపు సీనరేజ్ చెల్లించి టిప్పర్లతో ఇష్టారాజ్యంగా మట్టి, గ్రావెల్ తవ్వడం షరామామూలైందని రాజుపాలెం గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని వారు అంటున్నారు. చిన్నచెరువులో కట్టకు అత్యంత సమీపంలో క్వారీలను తలపించేలా గోతులు తీయడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్నది వర్షాకాలం అయినందున కట్టకోతకు గురైతే లోతట్టు ప్రాంతాల్లో ఉండే పడమటిపాలెం, నేతపాలెం, తూర్పుపాలెం, నవాబుమిట్ట ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. అంతే కాకుండా కట్టపై నుంచి టిప్పర్లు వెళ్లేలా రహదారి కూడా ఏర్పాటు చేసుకున్నారని వారు ఆరోపిస్తున్నారు. గతంలో ఈగోతుల్లో పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. అలా పెద్దపెద్దగోతులు తీయడం వలన గ్రామస్థులకు, పశువులకు, పర్యావరణానికి నష్టం జరిగే ప్రమాదం ఉందని అధికారులకు చెప్పినా మాగోడు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. రైల్వేకట్ట నిర్మాణానికి ఇక్కడి నుంచే కాంట్రాక్టర్ వేలాది టిప్పర్ల మట్టిని తోలారు. వాటికి అనుమతుల గురించి ప్రశ్నించినా సమాధానం ఇవ్వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై కలెక్టర్‌కు, మైనింగ్‌శాఖ ఏడీకి, పొదిలి, మర్రిపూడి మండలాల తహసీల్దార్లకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రాజుపాలెం గ్రామస్థులు చెబుతున్నారు.

డిప్యూటీ తహసీల్దార్ చేతివాటం

- తహసీల్దార్ సెలవులో ఉన్న సమయంలో కన్వర్షన్ ఫైల్‌పై సంతకాలు
- లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు
- ఆర్డీవో విచారణతో వెలుగులోకి వ్యవహారం

మద్దిపాడు, జూలై 6 : మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో భూగోల్‌మాల్ జరిగింది. తహసీల్దార్‌కు, వీఆర్వోకు తెలియకుండా నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటీ తహసీల్దార్ ఆశాజ్యోతి భూమి కన్వర్షన్ ఫైల్‌పై సంతకాలు చేశారు. అందుకోసం భారీగా ముడుపులు తీసుకున్నారు. ఆర్డీవో విచారణలో ఈ వ్యవహారం బహిర్గతమైంది. వివరాల్లోకి వెళితే.. మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు సర్వేనెం 31 ఎఫ్‌లో 2 ఎకరాల 19సెంట్ల భూమిని కన్వర్షన్ చేసేందుకు తహసీల్దార్ అనూరాధకు తెలియకుండా డీటీ ఫైల్‌పై సంతకాలు చేసి ఒంగోలు ఆర్డీవో కార్యాలయానికి పంపారు. గతనెల 20, 21 తేదీలలో తహసీల్దార్ సెలవుపై వెళ్లారు. అదేఅదనుగా చూసుకుని క్షేత్రస్థాయిలో వీఆర్వోకు సైతం తెలియకుండా డీటీ ఫైల్‌ను ఆర్డీవో కార్యాలయానికి పంపారు. భూమి కన్వర్షన్ కోసం ఏడుగుండ్లపాడుకు చెందిన ఓ రైతుతో ఆమె ఒప్పందం చేసుకుని రూ.2లక్షలు తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఫైలు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లడంతో ఆయన సంబంధిత భూమిని పరిశీలించారు. విషయాన్ని మద్దిపాడు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె అవాక్కయ్యారు. అనంతరం విచారణ చేయగా డిప్యూటీ తహసీల్దార్ బండారం బయటపడింది. డీటీని విచారించగా ఆమె పొంతన లేని సమాధానాలు ఇస్తుండటంతో అధికారులు సైతం విస్తుపోతున్నారు. ఏడుగుండ్లపాడు భూమితోపాటు మరికొన్ని భూములకు సంబంధించిన ఫైళ్లను సైతం ఆమె ఇదేవిధంగా చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీఆర్వో ప్రిసైడింగ్‌తోపాటు ఆమె రిపోర్టును కూడా డిప్యూటీ తహసీల్దార్ పూర్తిచేసినట్లు విచారణలో తేలింది. దీనిపై తహసీల్దార్ అనూరాధ మాట్లాడుతూ తాను సెలవులో వెళ్లినప్పుడు డీటీకి ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వలేదన్నారు. కన్వర్షన్ ఫైలు వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని ఆర్డీవో ఆదేశించినట్లు తెలిపారు. వీఆర్వో మౌనిక సైతం తాను ఎటువంటి ఫైలుపై సంతకం చేయలేదని తెలిపింది. దీంతో తహసీల్దార్ సమగ్ర నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపేందుకు సిద్ధమవుతున్నారు.





ప్రగతి రథసారథి

ఒంగోలు ఆర్టీసీ డిపోకు పోకల మల్లేశ్వరరావు ఏర్పాటు చేసిన హయ్యర్ బస్సును శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్‌రావు శనివారం ప్రారంభించారు. కొద్దిదూరం బస్సును నడిపి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఆర్టీసీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. - ఒంగోలు కార్పొరేషన్

జంక్షన్స్..డేంజరస్..!

కూడళ్లలో తరచూ ప్రమాదాలు ● నిత్యం ట్రాఫిక్ సమస్యలు

నగరవాసులకు తప్పని పాట్లు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 6 : ఒంగోలు నగరంలోని పలు రహదారుల మూల మలుపులు డేంజర్ జంక్షన్‌లుగా మారాయి. ఆయా ప్రాంతాల్లోని ప్రధాన కూడలి వద్ద ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడం నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రతిరోజుల పదుల సంఖ్యలోనే వాహనాదారులు పల్టీలు కొడుతున్నా, సంబంధిత అధికారుల చర్యలు కనీసం శూన్యమయ్యాయి. గోతుల మయమైన రహదారులు మరమ్మతులు చేపట్టకుండా నగరపాలక సంస్థ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు ఎవరికి వారే చోద్యం చూస్తుండగా, ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన ట్రాఫిక్ పోలీస్‌లు పర్యవేక్షణ ప్రధాన రహదారులకే పరిమితమయింది. ముఖ్యంగా ప్రతిరోజు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాలను పరిశీలిస్తే స్థానిక కాపు కళ్యాణ మండపం వద్ద అంజయ్య రోడ్ నుంచి ఆర్టీసీ వైపు, అదేవిధంగా కోర్టుసెంటర్ నుంచి రంగారాయుడు చెరువువైపు, స్థానిక జయరాంహాలు సెంటర్, సీవీఎన్ రీడింగ్ రూమ్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నాలుగు రోడ్ల కూడలి, కార్పొరేషన్ కార్యాలయం శివాలయం మార్గ మధ్యలోని మూలమలుపులు మరింత ప్రమాదకరంగా మారాయి. వాటితోపాటు స్థానిక అద్దంకి బస్టాండ్‌సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఆ మార్గంలోని నాలుగు రోడ్లలో రాకపోకలు సాగిస్తుండగా కనీసం ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుల్ మచ్చుకైనా కనిపించకపోవడం ప్రమాదాలకు కారణంగా కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా లాయరుపేట వీఐపీరోడ్ నుంచి బైపాస్ రోడ్డు వెళ్ళే మలుపులోనూ, గుంటూరురోడ్‌లో నుంచి త్రోవగుంట వైపు జాతీయ రహదారిలోనూ ఇదే పరిస్థితి. స్థానిక చర్చి సెంటర్ నాలుగు రోడ్ల జంక్షన్, రైల్వేస్టేషన్‌కు వెళ్ళే రోడ్ మార్గంలోని స్టేట్ బ్యాంక్ సమీపంలోను ప్రమాదాలు జరుగుతున్నాయి.



కొత్తపట్నం బస్టాండు సెంటరులో..



ఆర్టీసీ డిపో కూడలిలో గందరగోళంగా వాహనాల రాకపోకలు



రంగారాయుడు చెరువు కట్ట కూడలిలో వాహనదారుల అవస్థలు

భయం గుప్పిట్లో ప్రయాణం

నేడు మార్కెట్‌లో లభిస్తున్న 120, 150 సీసీ ద్విచక్రవాహనాలుపై కుర్రాళ్ళు దూకుడుతో దూసుకుపోతుండగా, అడ్డగోలు..అమిత వేగంతో వెళ్ళే ఆటోల స్పీడుకు బ్రేక్‌లు పడటం లేదు. ఫలితంగా వాహనచోదుకులతోపాటు ఆ వైపుగా నడిచే పాదచారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రత్యేకించి పాఠశాలల జరిగే రోజుల్లో చిన్నారులు, భయంభయంగా మూల మలుపులు, రహదారులు దాటాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అదేవిధంగా వృద్ధులు, మహిళలు రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాలి

పెరుగుతున్న ప్రమాదాల నియంత్రణకు సంబంధి శాఖాధికారులు సమన్వయం కలిగి చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు. నిత్యం వాహనాల ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో పోలీస్ పర్యవేక్షణతోపాటు పనిచేయని సిగ్నల్ లైట్‌లను వినియోగంలోకి తీసుకొచ్చి, నగర హోదాకు అనుగుణంగా తగు శ్రద్ధ చూపాలని, ప్రజలను ప్రమాదాల బారిన పడకుండా దృష్టి సారించాని కోరుతున్నారు.

ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలి

● ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్



ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 6: ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్ ఆదేశించారు. శనివారం అమరావతి నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన ఇసుకపాలసీపై సంబంధిత కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక స్టాక్ పాయింట్లను పరిశీలించాలని చెప్పారు. అనంతరం ఒంగోలులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న ఇసుక నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, జేసీ ఆర్.గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, గనులు, భూగర్భవనరుల జిల్లా అధికారి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 6: త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందించబోతున్నారని, అయితే ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ఈ సౌకర్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చర్యలు చేపట్టారని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలులోని ఆర్టీసి డిపోకు పోకల మల్లేశ్వరరావు ఏర్పాటు చేసిన హయ్యర్ బస్‌ను ఎమ్మెల్యే దామచర్ల శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే ప్రయాణికులకు అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా బస్‌చార్జీలు పెంచి ప్రయాణికుల నెత్తిన భారాలు మోపారని ఆరోపించారు. ఆర్టీసీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని, వాటి పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని దామచర్ల తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, ఆర్ఎం బి.సుధాకర్‌బాబు, డిపో మేనేజరు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఏపీయూడబ్ల్యూజే జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవం

అధ్యక్ష, కార్యదర్శులుగా రమణ, కనకయ్య ● ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటరావు, శంకర్

మార్కాపురం, జూలై 6: ఏపీయూడబ్ల్యూజే జిల్లా నూతన కమిటీలు ఏకగ్రీవమయ్యాయి. కమిటీ ఎన్నికలు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగాయి. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నామినేషన్‌ల ప్రక్రియ జరిగింది. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన బేతాళ శ్రీనివాసరావు, జీఎల్.నరసింహారావులు నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ.సుబ్బారావు నామినేషన్‌లు వేసి వారితో చర్చించారు. ఏకగ్రీవంగా కమిటీ ఎన్నికయ్యేందుకు అందరూ అంగీకరించారు. దీంతో ఎన్నికల అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీల వివరాలను వెల్లడించారు. ఏపీయూడబ్ల్యూజే నూతన జిల్లా అధ్యక్షులుగా మార్కాపురానికి చెందిన ఎస్‌వీ.రమణ, కార్యదర్శిగా ఒంగోలుకు చెందిన దాసరి కనకయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే.ఇస్మైకర్, విజయభాస్కర్, సహాయ కార్యదర్శులుగా బంకా శ్రీనివాసులు, పి.వెంకటేశ్వర్లు, ఎస్‌కే.మీర్ మొహిద్దీన్, కోశాధికారిగా డి.శరణ్‌కుమార్ (బాబి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా కుమార్, జి.రమేష్, కోటిరెడ్డి, హనీఫ్, మహ్మద్‌బాష, షాబీర్‌హుసేన్, విజయ్ కుమార్, టి.అంజిరెడ్డి, రవికుమార్, శ్రీనులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బి.వెంకటరావు, శంకర్, ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు, వి.సురేష్, సహాయ కార్యదర్శులుగా ఎం.సాయిరాం, ఎస్‌కే.బాజీవలి, సీహెచ్.వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారిగా ఎం.జయరాం, కార్యవర్గ సభ్యులుగా ఎ.బాలకృష్ణ, జి.శివప్రసాద్, ఎస్‌డీ.సుభాని, బి.హరిబాబు, వీఎన్ సుబ్రహ్మణ్యం, ఎస్‌కే.జాఫర్, ఎస్‌కే.సాధిక్, జి.ప్రశాంత్, సీహెచ్.మల్లిఖార్జున్, ఎస్‌కే.అబ్బుతుల్లాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీలను పలువురు దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అలుగుల సురేష్, యూనియన్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌రెడ్డి, నాయకులు కాశీరావు, ఎం.అల్లూరిరెడ్డి, కేవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు

బ్రాంచ్ ఎంపికే భవిష్యత్తుకు తొలిమెట్టు

ఘనంగా బ్రిలియంట్ ఇంజనీరింగ్ మాక్‌వెబ్ కౌన్సెలింగ్ ● ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కల్చరల్), జూలై 6: ఇంజనీరింగ్ కోర్సుల్లో బ్రాంచ్ ఎంపికే భవిష్యత్తుకు తొలిమెట్టని, బీటెక్‌లో ప్రతి బ్రాంచ్ ఉత్తమమైనదేనని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని ఏ1 ఫంక్షన్‌హాలులో బ్రిలియంట్ కంప్యూటర్స్ ఏర్పాటు చేసిన ప్రత్యేక మాక్‌వెబ్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని ఆయన జ్యోతిప్రజ్వలన చేసిం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ షేక్ న్యామతుల్లాబాషా ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో దామచర్ల మాట్లాడుతూ ఇంజనీరింగ్, మెడికల్ వంటి కోర్సులతో మంచి భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. రిటైర్డ్ డీజీపీ కేఆర్ఎం.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతగా చదవటం వల్ల కుటుంబానికే కాకుండా దేశానికి సైతం ఎంతో ఉపయోగకరమని చెప్పారు. అలాగే పలు విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కాలేజీలకు సంబంధిచిన వైస్ చాన్సులర్లు, ప్రొఫెసర్లు ఇంజనీరింగ్, మెడికల్, డిగ్రీ విద్యార్థులకు ఆయా కోర్సులపై పలు సూచనలు ఇచ్చి అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ అధికారులు విద్యారుణాలను మంజూరు చేయటానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బ్రిలియంట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తహుర, క్విస్ కళాశాలల అధినేత నిడమానూరి నాగేశ్వరరావు, గోరంట్ల రవికుమార్, రామ్‌ప్రసాద్, ఖలీఫాతుల్లాబాషా, పలు విద్యాసంస్థల అధినేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలి

● డీఎస్‌వో ఉదయభాస్కర్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 6: ప్రజలకు నిత్యావసర సరుకులు భారం కాకుండా ఉండేందుకు వ్యాపారులు ధరలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఉదయభాస్కర్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఎస్‌వో కార్యాలయంలో శనివారం రైస్‌మిల్లర్లు, దాల్‌మిల్లర్లు, హోల్‌సెల్ వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. అందువల్ల వ్యాపారులు ప్రజల పట్ల బాధ్యత కలిగి ఉండాలని చెప్పారు. వ్యాపారులు స్వచ్ఛందంగా కొంతమేర ధరలు తగ్గించాలని సూచించారు. ప్రభుత్వశాఖలకు సంబంధించిన అన్ని లైసెన్సులు సరి చూసుకోవాలన్నారు పౌరసరఫరాల కార్పొరేషన్ అధికారి గంగాధర్ పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో సహాయ అధికారి పుల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయభాస్కర్



తూర్పునాయుడుపాలెంలో వేమూరు టీడీపీ నాయకులు

టంగుటూరు చేరిన టీడీపీ నాయకుల పాదయాత్ర

టంగుటూరు, జూలై 6 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించడంతో బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు లాక్ సెంటర్ వినాయక గుడి నుంచి తిరుమలకు అక్కడి టీడీపీ నాయకులు పాదయాత్ర చేపట్టారు. వీరు శనివారం జాతీయ రహదారిలోని ఉన్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెం చేరుకున్నారు. వారికి మంత్రి స్వాగతం పలికారు. టంగుటూరులోనూ టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

బోధనా సిబ్బంది

సేవలు కొనసాగింపు

● సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు

ఒంగోలు(విద్య), జూలై 6: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బంది సేవలను కొనసాగిస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు బోధనా సిబ్బందిని ఈ ఏడాది కొనసాగించేందుకు వారి పనితీరును మదింపు చేసేందుకు సమగ్ర శిక్ష చర్యలు చేపట్టింది. దీనికోసం కీ పెర్ఫార్మెన్స్ పాయింట్లను రూపొందించింది దీని ప్రకారం 35శాతం కంటే ఎక్కువ పాయింట్లు వచ్చిన వారిని కొనసాగించి మిగిలిన వారి విషయంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు వ్యవహరించాలని భావించారు. ఈ నేపథ్యంలో మొదటగా 35శాతంపైన పాయింట్లు సాధించిన వారిని కొనసాగింపు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో 35శాతం కంటే తక్కువ పాయింట్లు సాధించిన ఉద్యోగులు నేరుగా సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్‌ను కలిసి తమ పనితీరు మెరుగుకు పర్చుకుంటామని, మంచి ఫలితాలు సాధిస్తామని విన్నవించుకున్నారు.

సీబీఎస్ఈ విద్యార్థులకు తెలుగు పాత సిలబస్

ఒంగోలు(విద్య), జూలై 6 : ప్రస్తుత విద్యా సంవత్సరంలో (2024-25) సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలుగు పాత సిలబస్ వర్తింపజేస్తూ పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరపు తెలుగు పాఠ్యపుస్తకాలనే ఇవ్వనున్నారు. వీరి కోసం పాత పాఠ్యపుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందజేయాలని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల డైరెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో 1094 మంది, జడ్పీ హైస్కూళ్లలో 988, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 34, ఏపీ మోడల్ స్కూళ్లలో 495, సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల్లో 811, ప్రభుత్వ హైస్కూళ్లలో 996, ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో 220, మునిసిపల్ హైస్కూళ్లలో 213 మందితో కలిపి 4851 మంది పదో తరగతి విద్యార్థులు ఈ సిలబస్ చదువుతున్నారు.

జీతాలు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారు..

● సర్పంచ్‌పై షెడ్డుమిత్ర ఫిర్యాదు

మద్దిపాడు, జూలై 6: తనకు పెండింగ్‌లో ఉన్న ఎనిమిది నెలల జీతాలను ఇచ్చేలా చూడాలని, జీతం కోసం సర్పంచ్ సుబ్బారావును సంప్రదిస్తే అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని షెడ్డుమిత్ర కార్మికుడు మెరబోయిన సురేష్ వాపోయారు. ఈమేరకు శనివారం మద్దిపాడులో ఈవోఆర్డీ కొండపి రఘుబాబును కలిసి ఫిర్యాదు చేశారు. దొడ్డవరం పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీలో షెడ్‌మిత్రగా 2020 నుంచి సురేష్ పనిచేస్తున్నాడు. తన భార్య గర్భవతిగా ఉందని, హాస్పటల్ ఖర్చుల కింద డబ్బుల కోసం అనేక పార్యయాలు స్థానిక పంచాయతీ కార్యదర్శిని, సర్పంచ్‌ను వేడుకొన్నా తన జీతభత్యాలు ఇవ్వలేదన్నారు. అంతగాకుండా అసభ్య పదజాలంతో సర్పంచ్ దూషించారని ఆరోపించారు. పంచాయతీలో నీటి పన్నుల వసూలు విషయంలో అవకతవకలు జరిగాయని, గతంలో విచారణాధికారిగా వచ్చిన ఈవోఆర్డీ ఎదుట తాను జరిగిన వాస్తవాలు చేబితే సర్పంచ్ తనపై కక్ష కట్టారన్నారు. ఈక్రమంలో తనకు రావాల్సిన జీతాలను నిలిపేశారని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆయన వేడుకున్నారు.

పాఠశాలలో వసతుల పరిశీలన

టంగుటూరు, జూలై 6 : మండలంలోని ఎం.నిడమలూరు అరుంధతీవాడలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను టీడీపీ నేతలు శనివారం సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని పలు సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. పాఠశాల దుస్థితిని మంత్రి స్వామికి వివరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాకుమాను శ్రీకాంత్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు కాకుమాని శ్రీనివాస్, పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి పేరాబత్తిన రంగారావు, అరుంధతీవాడ టీడీపీ నాయకులు శేఖర్, కోటి, బెన్ని, వినయ్, శ్రావణ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



వసతుల వివరాలు తెలుసుకుంటున్న టీడీపీ నాయకులు

భాష్యంలో రెయిన్ డే

టంగుటూరు, జూలై 6 : టంగుటూరులోని భాష్యం స్కూల్‌లో శనివారం రెయిన్ డే నిర్వహించారు ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్‌బాషా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, హెచ్ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

అవీ..ఇవీ..

హైకోర్టులో ప్రభుత్వ సహాయ ప్లీడర్లుగా జిల్లావాసులు



అర్జున్‌చౌదరి, అబ్దుల్‌రషీద్ అహ్మద్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 6: ఏపీ హైకోర్టు ప్రభుత్వ సహాయ ప్లీడర్లుగా (ఏజీపీ)లుగా జిల్లాకు చెందిన ఇరువురు న్యాయవాదులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు చెందిన షేక్ అబ్దుల్‌రషీద్‌అహ్మద్, కొల్లూరు అర్జున్‌చౌదరి ఏజీపీలుగా నియమితులయ్యారు. జిల్లాకు చెందిన ఇరువురు న్యాయవాదులు అతి చిన్న వయస్సులోనే ప్రభుత్వ సహాయ న్యాయవాదులుగా ఎంపిక కావడం పట్ల పలువురు న్యాయవాదులు శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

13,14 తేదీల్లో బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 6: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13,14వ తేదీలలో జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు పీడీబీఏ సెక్రటరీ పి.విజయకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మంగమూరురోడ్‌లోని ది లార్డ్‌కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో రెండు రోజులపాటు స్త్రీ, పురుషుల విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. అండర్-11, 13, 15, 17, 19 వయస్సు విభాగల వారు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని, ఆసక్తి గల క్రీడాకారులు సెల్: 9398260109, 8328268419 ద్వారా ఈనెల 12వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీలో పాల్గొనేందుకు సింగిల్స్ రూ.400, డబుల్స్ రూ.800, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు వయస్సు ధృవీకరణపత్రం, ఆధార్‌కార్డు ఒరిజినల్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు పైన తెలిసిన సెల్‌నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా నామినేని



నామినేని కిరణ్‌కుమార్

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 6: ఒంగోలులోని సర్వజన ప్రభుత్వ వైద్యశాల (జీజీహెచ్) డిప్యూటీ సూపరింటెండెంట్‌గా డెంటల్ విభాగం హెచ్‌వోడీ, ప్రొఫెసర్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా, డెంటల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర చైర్మన్‌గా ఆయన పనిచేశారు. ఆ తర్వాత బదిలీపై గుంటూరు జీజీహెచ్‌కు బదిలీ అయిన కిరణ్‌కమార్ గత కొద్ది నెలల క్రితం తిరిగి ఒంగోలుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా నామినేని ఉన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 6 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి రెండు రోజుల పాటు ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు నగరానికి చేరుకుంటారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతారు. సోమవారం ఉదయం 8గంటలకు మాగుంట కార్యాలయంలో, అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో మాగుంట పాల్గొంటారు.

ఉత్సాహంగా జగన్నాథ రథచక్ర మహోత్సవం



ఉట్టి కొడుతున్న చిన్నారులు

ఒంగోలు(కల్చరల్), జూలై 6: పూరి జగన్నాథ రథచక్ర మహోత్సవాన్ని శనివారం ఒంగోలు నగరం సంతపేటలోని టైనీ బెల్స్ ప్రీ స్కూల్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ, యుకేజీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, సత్యభామ, గొల్లభామల వేషధారణలో ఉట్టికొట్టి ఉత్సాహంగా ఆడారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పూరీ జగన్నాథస్వామి చిత్రపటాలు విశేషంగా ఆకర్షించాయి. స్కూలు చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, డైరెక్టర్ సుజితాశేఖర్‌లు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల చిన్నతనం నుంచే విద్యార్థులలో భక్తిభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

లైబ్రరీకి క్యారంబోర్డుల వితరణ



క్యారంబోర్డులను అందజేస్తున్న దాతలు

నాగులుప్పలపాడు, జూలై 6: ఉప్పుగుండూరులోని గ్రంథాలయానికి గ్రామానికి చెందిన స్టార్ స్టూడియో వ్యవస్థాపకులు రామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి కోటేశ్వరమ్మ, కుమారులు యుగంధర్, విఠల్‌లు రెండు క్యారంబోర్డులను శనివారం బహూకరించారు. పుస్తక పఠనంతో పాటు విద్యార్థులకు ఆటపాటల పట్ల అభిరుచి కలిగించే ప్రయత్నంలో భాగంగా క్యారంబోర్డులు సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శామ్యూల్ చేతుల మీదుగా అందించారని గ్రంథపాలకులు ఎ.ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ జయకర్‌బాబు, వాసవి క్లబ్ జిల్లా క్యాబినేట్స్ కోశాధికారి రాజేష్ పాల్గొన్నారు.

నందిపాడు సొసైటీ ద్వారా విరివిగా రుణాలు



వేడుకల్లో పాల్గొన్న రైతులు, అధికారులు

మద్దిపాడు, జూలై 6: నందిపాడు సహకార సంఘం ద్వారా రైతులకు విరివిగా రుణాలు అందిస్తున్నట్లు సీఈవో ఎన్.రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం మద్దిపాడులోని నందిపాడు సొసైటీ కార్యాలయంలో సహకార సంఘం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల తమ డిపాజిట్లుపై అధిక వడ్డీ పొందవచ్చన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు ఎరువులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాదాల చిరంజీవి, కొమ్మాలపాటి సుబ్బారావు, పోతుల శ్రీరామమూర్తి, నల్లూరి మహేష్, కొండగుంట నాగేశ్వరరావు, ఏడుగుండ్ల సత్యనారాయణ, పురాలశెట్టి ఆంజనేయులు, వివిధ గ్రామాల రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మాక్ పార్లమెంట్



చర్చలో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 6: ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాక్ పార్లమెంట్ అనే అంశంపై చర్చావేదికను శనివారం నిర్వహించారు. విద్యార్థులు రాజ్యసభ, లోక్‌సభలలో జరిగే కార్యకలాపాలకు సంబంధించిన అంశాలను చిన్నచిన్న చర్చలద్వారా ప్రదర్శించి చూపారు. అనంతరం ఆకడమిక్ డైరెక్టర్ శృతిసాయినాథుని మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రక్రియలపై అవగాహన పెంపొందించుకొని సమాజ సమస్యల పట్ల స్పందించి ప్రశ్నించే అలవాటును చేసుకోవాలన్నారు. కరస్పాండెంట్ జీవీ.భాస్కర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు పెరుగుతున్నాయన్నారు. ప్రిన్సిపాల్ ఎం.మహేష్ పాల్గొన్నారు.

విద్యా ప్రవేశ్‌పై సమీక్ష



మాట్లాడుతున్న రమేష్

నాగులుప్పలపాడు, జూలై 6 : పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి వరకు విద్యాప్రవేశ్ కార్యక్రమాలను నిర్వహించాలని సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్ సూచించారు. నాగులుప్పలపాడులోని ఎంఈవో కార్యాలయంలో సీఆర్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడి బయట ఉన్న పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పాలన్నారు అనంతరం ఉప్పుగుండూరులో దివ్యాంగులైన విద్యార్థులను పరిశీలించి వారందరినీ పాఠశాలల్లో చేర్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈపీ.రమణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పృథులగిరి క్షేత్ర అభివృద్ధికి కృషి

- మంత్రి స్వామి



లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనం అనంతరం మాట్లాడుతున్న మంత్రి స్వామి

మర్రిపూడి, జూలై 6 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథుల గిరి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చెప్పారు. మంత్రి పదవి చేపట్టిన అనంతరం శనివారం తొలిసారి ఆయన పృథులగిరికి వచ్చారు. లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నరసింహస్వామి దర్శనం అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. దేవాలయ గర్భగుడిలో చీకటిగా ఉండటంతో దైవదర్శనం చేసుకోవడం భక్తులకు ఇబ్బందికరంగా ఉన్నట్లు గమనించానన్నారు. ఆలయ ముఖ మండపంలో ఇనుప గ్రిల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఈవో శ్రీనివాసరావుకు సూచించారు. అంతరాలయంలో మరమ్మతులకు అవసరమైన నిధులను తాను సొంతంగా సమకూర్చుతానని హామీ ఇచ్చారు. బ్రహ్మోత్సవాల సమయంలో కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించేందుకు ప్రత్యేక ఎల్ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్నసత్ర సముదాయాల వద్ద నీటికుంట నుంచి మెట్ల రహదారి వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఘాట్‌రోడ్డు నిర్మాణం, మర్రిపూడి నుంచి యానాది కాలనీ వరకు ఏర్పాటు చేయనున్న తారురోడ్డు పనులకు అవసరమైన అటవీ అనుమతులు ఇప్పించేందుకు త్వరలో ఆశాఖ మంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు అధికారులను కలుద్దామని స్థానిక నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శేషవస్త్రంతో స్వామిని సత్కరించారు. కార్యక్రమంలో కొండపి, పొదిలి మార్కెట్ కమిటీల మాజీ చైర్మన్‌లు గొర్రెపాటి రామయ్య చౌదరి, ఎర్రమోతు శ్రీనివాసులు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తుళ్లూరి నరసింహారావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు హనుమారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బీఎల్ఎన్ శాస్త్రి, నాయకులు సారెడ్డి యోగిరెడ్డి, పుల్లారెడ్డి, మోహన్‌రావు, బాల నరసయ్య, వై.వెంకటరెడ్డి, ఎం.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

- ఎమ్మెల్యే దామచర్ల
- ఘనంగా జూనోసిస్ డే



కుక్కలకు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 6: పెంపుడు జంతువులపై ప్రేమ మంచిదేనని, అయితే వాటి ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించడం కూడా ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ డే కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంతపేటలోని పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన జంతువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని దామచర్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కాలంలో జంతువుల పట్ల ప్రేమను పంచడమే కాకుండా, వాటిని పెంచడం నిత్యం కనిపిస్తుందన్నారు. అయితే జంతువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, నిత్యం మనుషుల మధ్య ఉండే వాటికి ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. అందుకోసం పశువైద్యశాలలో అవసరమైన మందులు, వ్యాక్సినేషన్, వైద్యం ఉచితంగా అందిస్తున్నారని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించడం ద్వారా జంతువుల ఆరోగ్యంతోపాటు, వాటిని పెంచే యజమానులు ప్రమాదకర రేబిస్ బారిన పడకుండా ఉంటారని తెలిపారు. రేబిస్ వేక్సినేషన్‌ను ఉచితంగా అందజేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, జాయింట్ డైరెక్టర్ బేబీరాణి, అసిస్టెంట్ డైరెక్టర్ సురేంద్ర, వైద్యాధికాకారులు రమేష్‌బాబు, సాహితీ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ, జూలై 6 : జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో శనివారం వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. పెంపుడు కుక్కలకు వచ్చే వ్యాధులు, వాటికి చేయాల్సిన చికిత్సలు, ఆహార నియమాలను పశువైద్యుడు డాక్టర్ నగళ్ల హజరత్ వివరించారు. అనంతరం 98 కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.





ఒంగోలులో టీకాలు వేయించేందుకు కుక్కలను తీసుకవస్తున్న యజమానులు



సింగరాయకొండలో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి

అక్రమ కేసులను తొలగించాలి

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి



మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 6: రాష్ట్ర సాంఘికసంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డికిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామిని కలిసి ముందుగా బొకే ఇచ్చారు. అనంతరం పలు అంశాలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణపై అక్రమంగా గత ప్రభుత్వంలో పెట్టిన కేసులను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్ మసూద్‌అలీ, భాను, రంగారెడ్డి, సురేష్, శ్రీకాంత్‌రెడ్డి, పెన్షనర్ల వింగ్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, శ్రీనివాసులు, అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 6: ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్‌మాదిగ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నెల్లూరు బస్టాండులోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగలకుర్తి ప్రసాద్, నారాయణ, జేమ్స్, అభిషేక్, రమేష్, పల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న వీరమహిళలు



పాదయాత్రగా వెళుతున్న వీరమహిళలు

ముండ్లమూరు, జూలై 6: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించటంతో ఈదర గ్రామానికి చెందిన వీర మహిళలు, అభిమానులు శనివారం పాదయాత్రగా శింగరకొండ వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. 45 కి.మీ పాదయాత్రగా వెళ్లి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

లొంగిపోయిన రైతులు

మార్కాపురం, జూలై 6: మూడు రోజుల క్రితం మిర్చి వ్యాపారిని కిడ్నాప్ చేసి విడిచిపెట్టిన రైతులు ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయారు. శనివారం రాత్రి వారే నేరుగా పోలీసుస్టేషన్‌కు వచ్చారు. రెండు రోజులుగా పోలీసులు, అధికారులు వారిశైలిలో అన్ని వైపుల నుంచి వారి బంధువులపై ఒత్తిడి పెంచారు. తమకు న్యాయం చేస్తామంటే లొంగిపోతామని వారు పోలీసులకు రాయబారం పంపారు. చట్టపరిధిలో తాము న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో 9 మందికి 8 మంది రైతులు లొంగిపోయారు. వారిని రిమాండ్ పంపుతున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

యువకుడి హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- పరారీలో నిందితులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రంగనాథ్, ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ, జూలై 6 : వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఆయన ప్రియురాలే మరో వ్యక్తితో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడింది. ఈ ఘటన స్థానిక జాతీయ రహదారిపై ఉన్న పోలేరమ్మ గుడి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఇంటూరు గ్రామానికి చెందిన గోపి (37)కి తెనాలికి చెందిన ఓ మహిళతో ఎనిమిదేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. ఆమెకు ఎనిమిది నెలల క్రితం దుగ్గిరాల మండలం మోరంపూడికి చెందిన నాగరాజుతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి అతనితో సహజీవనం చేస్తూ గోపిని దూరం పెట్టింది. ఆమెను కలిసేందుకు గోపి వెళ్లిన పలు సందర్భాల్లో ఆయనపై ఇద్దరూ కలిసి దాడి చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆమె నాగరాజుతో కలిసి శుక్రవారం సింగరాయకొండ వచ్చింది. విషయం తెలుసుకున్న గోపి కూడా అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గురి మధ్య వివాదం తలెత్తింది. ఈ సమయంలో గోపి తలపై నాగరాజు, ప్రియురాలు కర్రతో బలంగా కొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ రంగనాథ్, ఎస్సై శ్రీరామ్ శనివారం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి నిందితులు కోసం గాలిస్తున్నారు.

అపార్టుమెంట్ పైనుంచి పడి వ్యక్తి మృతి

పొదిలి, జూలై 6 : పొదిలిలోని ఎస్ఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో నీళ్లట్యాంక్ శుభ్రపరిచేందుకు ట్యాంకుపైకెక్కిన కోమటికుంట్ల వెంకటసుబ్బయ్య(35) ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటసుబ్బయ్య తల్లిదండ్రులు అక్కడే వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటారు. శనివారం ట్యాంక్ శుభ్రం చేసే క్రమంలో ప్రమాదం జరిగిందని ఎస్ఐ కోటయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డ్రైనేజీలు లేక ఎక్కడి మురుగు అక్కడే!

రోడ్ల పక్కనే చెత్తాచెదారం

దుర్వాసనతో పాదచారుల ఇక్కట్లు

గిద్దలూరు, జూలై 6 : గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీలు లేక పోవడంతో ఎక్కడిమురుగు అక్కడే నిలిచిపోతోంది. సిమెంటు రోడ్లు వేయడంపై చూపుతున్న చొరవ డ్రైనేజీల నిర్మాణంపై చూపడం లేదు. దాంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. వర్షం నీరు ముందుకు వెళ్ళలేక రోడ్లపై నిలిచి బురదమయంగా మారుతున్నది. దూర ప్రాంతాల నుంచి కొట్టుకుని వచ్చిన చెత్తాచెదారం రోడ్లకు ఇరువైపులా పేరుకుని పోతున్నది. ఆ చెత్తాచెదారం నుంచి వచ్చే దుర్వాసన భరించలేక పాదచారులు ముక్కు మూసుకుని నడవాల్సిన పరిస్థితి నెలకొన్నది. పట్టణ నడిబొడ్డులో ఉన్న క్లబ్ రోడ్డులో సగానికిపైగా దూరం రోడ్డుకు ఇరువైపులా మురుగునీటి కాలువలే లేవు. ఈ రోడ్డు సిమెంటు రోడ్డుగా నిర్మించినప్పటికీ కాలువలు లేక వర్షం నీరంతా రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లలో నిలబడి పోవడం, చెత్తాచెదారంతో వర్షం నీరు కలిసి మురుసటి రోజుకే దుర్వాసన వస్తుండడంతో పాదచారులు ఇక్కట్లకు గురవుతున్నారు. మున్సిపల్ కార్యాలయం పక్కన కూరగాయల మార్కెట్ ఉన్నది. దీని పక్క నుంచే షాదీఖానా, ఇతర గృహాలకు వెళ్ళే రోడ్డు ఉన్నది. ఈరోడ్డుకు ఇరువైపులా మురికినీటి కాలువలు లేవు. వ్యాపారులు కూరగాయల వ్యర్థాలను రోడ్డు మార్జిన్లలో పడవేస్తున్నారు. వీటిని తినేందుకు పందులు, ఆవులు, కుక్కలు అక్కడకు చేరుతున్నాయి. దీంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ రోడ్డులో ముక్కు మూసుకుని కూడా వెళ్ళేలేని పరిస్థితి కనిపిస్తున్నది. అలాగే జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పక్క రోడ్డులో చిన్నపాటి వర్షం కురిసినా బురదమయంగా మారుతున్నది.



క్లబ్ రోడ్డులో పోగైన చెత్తాచెదారం





షాదీఖానా రోడ్డులో నిలిచిన మురుగునీరు, చెత్తాచెదారం (ఇన్‌సెట్లో)బాలుర ఉన్నత పాఠశాల పక్క రోడ్డులో ఉన్న చెత్తాచెదారం

పట్టణ శివార్లలోని పలు వీధుల్లో సైతం డ్రైనేజీలు లేక చిన్నపాటి వర్షం పడినా మురుగు నిలిచి అపరిశుభ్రంగా మారుతోంది. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సిమెంటు రోడ్లతో పాటు మురుగునీటి కాలువలను కూడా ఒకే పర్యాయం నిర్మింప చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక నిధులతో ఇరిగేషన్ కాలువలను బాగు చేస్తాం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కంభం, జూలై 6 : ప్రత్యేక నిధులతో ఇరిగేషన్ కాలువలను బాగు చేస్తామని ఇరిగేషన్ డీఈ షేక్ జాకీర్‌అహమ్మద్ తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పంట కాలువల అభివృద్ధి పట్టదా అనే కథనానికి ఆయన స్పందించి ఓ ప్రకటన విడుదల చేశారు. కంభం ప్రధాన కాలువలు, పెద్దకంభం కాలువ, నక్కలగండి కాలువలు కంభం పట్టణం నడిబొడ్డున ప్రవహిస్తున్నందున గృహాల వారు తమ ఇళ్ల నుంచి వచ్చిన మురుగునీరు, హోటళ్ళ వారు చెత్తాచెదారం కాలువల్లో వేయడం వలన వ్యర్థాలతో నిండిపోయాయన్నారు. కంభం, హెచ్‌గూడెం, కందులాపురం పంచాయతీల కార్యదర్శులను కాలువల్లోని చెత్తాచెదారాలను తొలగించాలని,అలాగే చెత్త కాలువల్లో వేయకుండా తీర్మానం చేశామని అందులో పేర్కొన్నారు. అలాగే కాలువల మరమ్మతులకు రూ. 29.50 లక్షల నిధులకోసం అంచనాలు పంపించామని, మంజూరైన వెంటనే కాలువల మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కంభం, జూలై 6 : ప్రస్తుతం మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున మంచినీటి ట్యాంక్‌లు , బోర్ల దగ్గర, పరిసరాలను మురుగు లేకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేయాలని ఎంపీడీవో మస్తాన్‌వలి పంచాయతీ అధికారులకు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో ప్రతి వీధిలో మురుగు కాలువలను శుభ్రం చేసి దోమలు లేకుండా చూడాలని ఆదేశించారు. చిన్నకంభం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో వీఆర్వో తప్ప మిగిలిన సిబ్బంది హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అయినందున విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు సచివాలయాల ద్వారా అందజేస్తామని తెలిపారు. చిన్నకంభం పంచాయతీకి సంబంధించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. సేంద్రియ ఎరువులు తయారు చేయుటకు, వానపాములు వదులుటకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



చెత్తసంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో మస్తాన్‌వలి



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

పక్కా ప్రణాళికతో పట్టణాభివృద్ధి

● మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, జూలై 6 : ప్రణాళిక బద్ధంగా పట్టణాభివృద్ధి చేపట్టనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం గిద్దలూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరుగగా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కౌన్సిల్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా పట్టణంలో నీటి సమస్య నెలకొంటున్నదని, దీని పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తాను 2014-19 కాలంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గుండ్లమోటు ప్రాజెక్టు నుంచి డీప్‌బోర్లు వేయించి పైపులైన్ ద్వారా నీటిని పట్టణానికి తెప్పించామని, తద్వారా కొంత నీటి సమస్య తీరిందని అన్నారు. అలాగే రామన్నకతువ నుంచి పైపు లైన్ ద్వారా పట్టణానికి నీరు తెచ్చే ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు మురుగు కాలువలను శుభ్రం చేయిస్తూ బ్లీచింగ్ చల్లాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న కారణంగా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సాధారణ నిధులు లేని కారణంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్ళి ప్రత్యేక నిధులను తెప్పించేందుకు సమావేశంలో తీర్మానం చేశారు. ఈసమావేశంలో మొత్తం 26 తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ ఉయ్యాల శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

కుంటుపడుతున్న చదువులు

పెద్ద దోర్నాల, జూలై 6: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో చదువులు కుంటుపడుతున్నాయి. పాఠశాలలో 1,050 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.పదవ తరగతిలో 208 మంది విద్యార్థులున్నారు. ఈ పాఠశాలలో 40 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 26 మంది మాత్రమే ఉన్నారు. తెలుగు సబ్జెక్టుకు 5మందికి గాను ఒకరు,ఆంగ్లం 5మందికి ఒకరు, హిందీ నలుగురికి గాను ఒకరు, గణితం 6మందికి గాను ముగ్గురు, ఫిజికల్‌సైన్స్ 5కు ఇద్దరు, బయోలజీకల్ 5కు ఇద్దరు, సోషల్ 5కు ఒకరు, ఫిజికల్ డైరక్టర్ 4కు ఇద్దరున్నారు, ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు కూడా లేరు. దీంతో గణితం ఉపాధ్యాయులు ఎస్‌వీ నారాయణ రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. పాఠశాల గ్రామం నడిబొడ్డున ఉండడంతో వారిని అదుపు చేయడం తలనొప్పిగా మారింది. గతంలో 1,200 మంది పిల్లలు ఉండేవారు. గతేడాది నుంచి సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ఏడాది మరో పాఠశాలలో చేర్పించారు. దీంతో 150 మంది విద్యార్థులు తగ్గారు. ఈ ఏడాది ఇంకా తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. గతేడాది ఎర్రగొండపాలెం ప్రభుత్వ పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై నియామకం చేపట్టడంతో చాలా వరకు విద్యార్థులకు న్యాయం చేయగలిగామని, పదవ తరగతిలో 83శాతం ఉత్తీర్ణత సాధించగలిగామని ఉపా ధ్యాయులు చెప్పారు. సప్లిమెంటరీలో నూరు శాతం ఉత్తీర్ణులయినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



చెట్ల కింద నిర్వహిస్తున్న తరగతులు

తిరుమలకు టీడీపీ కార్యకర్తల పాదయాత్ర

సంఘీభావం తెలిపి ప్రారంభించిన కందుల

విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

మార్కాపురం రూరల్, జూలై 6: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, మార్కాపురం ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డి గెలుపొందిన సందర్భంగా నాయకులు బోయలపల్లి పోలిరెడ్డి ఆధ్వర్యంలో కోలభీమునిపాడుకు చెందిన 50 మంది కార్యకర్తలు తిరుమలకు శనివారం పాదయాత్రగా బయలుదేరారు. తిరుమలకు పాదయాత్ర ప్రారంభానికి ముందు గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో పాటు నియోజకవర్గ నాయకులు కందుల రామిరెడ్డి, పారిశ్రామికవేత్తలు వెన్నా పోలిరెడ్డి, సూరా పరమేశ్వర్ రెడ్డి, టీడీపీ మండల ముఖ్యనాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు, నాయకులకు గ్రామ టీడీపీ కార్యకర్తలు అభిమానులు బాణసంచా పేలుస్తూ డీజే పాటలతో కేరింతలతో ఉత్సాహంగా ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రధాన వీధులలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తల సమష్టి కృషితో రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. మార్కాపురంలో తన గెలుపు కోసం పనిచేసిన ప్రతిఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. గ్రామ సమీపంలోని ముద్దసానమ్మ ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి టీడీపీ కార్యకర్తలు పాదయాత్రను ప్రారంభించారు. నియోజవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ ఇమ్మడి కాశీనాథ్ పాదయాత్రలో తిరుమల వెళ్లే టీడీపీ కార్యకర్తలను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటెద్దు రామకృష్ణారెడ్డి, మట్టం వెంకటేశ్వర్లు, కోలభీమునిపాడు టీడీపీ నాయకులు ఏరువ నాగిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మంద వెంకటరెడ్డి, రామసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పాదయాత్రగా తిరుమలకు వెళ్తున్న టీడీపీ కార్యకర్తలకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే కందుల, నాయకులు



గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ కార్యకర్తలు, అభిమానులు

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, జూలై 6: ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌ను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ముందుగా పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మార్కాపురం నియోజకవర్గంలో పరిస్థితులపై ఆయన ఎస్పీతో చర్చించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లిఖార్జున్ ఉన్నారు.



ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి

వైభవంగా చెన్నకేశవస్వామి శాంతి కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 6: మార్కాపురంలో వెలసియున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి శాంతి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవ స్వామి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్య రంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.



కల్యాణంలో చెన్నకేశవుడు



ఏపీయూడబ్ల్యూజే జిల్లా నూతన కమిటీ

ఏపీయూడబ్ల్యూజే జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్‌వీ రమణ, దాసరి కనకయ్య

ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటరావు, శంకర్

మార్కాపురం, జూలై 6: ఏపీయూడబ్ల్యూజే జిల్లా నూతన కమిటీలు ఏకగ్రీవమయ్యాయి. కమిటీ ఎన్నికలు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగాయి. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నామినేషన్ల ప్రక్రియ జరిగింది. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన బేతాళ శ్రీనివాసరావు, జీఎల్ నరసింహారావులు నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు నామినేషన్‌లు వేసి వారితో చర్చించారు. ఏకగ్రీవంగా కమిటీ ఎన్నికయ్యేందుకు అందరూ అంగీకరించారు. దీంతో ఎన్నికల అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీల వివరాలను వెల్లడించారు. ఏపీయూడబ్ల్యూజే నూతన జిల్లా అధ్యక్షులుగా మార్కాపురానికి చెందిన ఎన్‌వీ రమణ, కార్యదర్శిగా ఒంగోలుకు చెందిన దాసరి కనకయ్య ఉపాధ్యక్షులుగా ఎస్‌కే ఇఫ్తేకర్, విజయ భాస్కర్, సహాయ కార్యదర్శులుగా బంకా శ్రీనివాసులు, పి.వెంకటేశ్వర్లు, ఎస్‌కే మీర్ మొహిద్దీన్, కోశాధికారిగా డి.శరణ్‌కుమార్ (బాబి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా కుమార్, జి.రమేష్, కోటిరెడ్డి, హనీఫ్, మహ్మద్ బాష, షాబీర్ హుసేన్, విజయ్‌కుమార్, టి.అంజిరెడ్డి, రవికుమార్, శ్రీనులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బి.వెంకటరావు, శంకర్, ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు, వి.సురేష్, సహాయ కార్యదర్శులుగా ఎం.సాయిరాం, ఎస్‌కె బాజీవలి, సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారిగా ఎం.జయరాం, కార్యవర్గ సభ్యులుగా ఎ.బాలకృష్ణ, జి.శివప్రసాద్, ఎస్‌డీ సుభాని, బి.హరిబాబు, వీఎన్ సుబ్రహ్మణ్యం, ఎస్‌కే జాఫర్, ఎస్‌కె సాధిక్, జి.ప్రశాంత్, సీహెచ్ మల్లిఖార్జున్, ఎస్‌కె అజ్మతుల్లాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీలను పలువురు దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అలుగుల సురేష్, యూనియన్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌రెడ్డి, నాయకులు కాశీరావు, ఎం.అల్లూరిరెడ్డి, కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తురిమెళ్ళలో పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

పాదయాత్రకు ఎమ్మెల్యే ముత్తుముల సంఘీభావం

కంభం, జూలై 6 : తురిమెళ్ళ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు, మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ శనివారం నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయానికి పాదయాత్ర చేస్తున్న సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆమెకు సంఘీభావం తెలిపారు. గిద్దలూరు ఎమ్మెల్యేగా ముత్తుముల అశోక్‌రెడ్డి విజయం సాధిస్తే తురిమెళ్ళ నుంచి రాచర్ల మండలం నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవాలయం వరకు టీడీపీ, జనసేన నాయకులతో పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నానని, ఈ సందర్భంగా పాదయాత్ర చేపట్టినట్లు వీరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంఘీభావం తెలుపడమేకాక ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈకార్యక్రమంలో తురిమెళ్ళ సర్పంచ్ మాదా సుభద్ర, పంచాయతీ, మండల టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణత అభియాన్ సేవలు

సద్వినియోగం చేసుకోవాలి

టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూలై 6 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంపూర్ణత అభియాన్ పథకంలో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కేంద్ర పరిశీలకులు ప్రదీప్, టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కార్యక్రమంలో శనివారం ఎర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయం నుంచి అంబేడ్కర్ ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించి, ఆడిటోరియంలో అవగాహన సభ నిర్వహించారు. ఎర్రగొండపాలెం మండలంలో 3 నెలలు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. టీడీపీ కూటమి ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఎంతో వెనుకబడిన ఎర్రగొండపాలెం మండలాన్ని సంపూర్ణత అభియాన్‌లో ఎంపిక చేయడం సంతోషం అని అన్నారు. అన్ని ప్రభుత్వం పాఠశాలల విద్యార్థినిలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జేడీఏ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో సురేష్ డీఎల్‌డీవో సాయి కుమార్, డీఆర్‌డీఏ పీడీ వసుందర, డీఎల్‌డీవో సాయికుమార్, తహసీల్దారు బి సోమ్లానాయక్, ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్, ఎంఈవో పి. ఆంజనేయులు, సీడీపీవో పద్మావతి, ఈవోపీఆర్‌డి రాజశేఖరరెడ్డి, కో ఆర్డినేటరు లక్ష్మీరెడ్డి అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు గూడూరి ఎరిక్షన్‌బాబు, కేంద్ర పరిశీలకులు ప్రదీప్ పంపిణీ చేశారు.



సంపూర్ణత అభియాన్ సభలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

హెల్మెట్‌ధారణతోనే ప్రాణాలకు రక్ష

మార్కాపురం, జూలై 6: హెల్మెట్‌ధారణతోనే ప్రాణాలకు రక్షణ ఉంటుందని మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నూతన చట్టాలపై మోటార్ సైక్లిస్ట్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నూతన చట్టాల ప్రకారం వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. లేకుంటే కఠిన శిక్షలు తప్పవన్నారు. అంతేకాక డ్రైవింగ్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. అతివేగంగా వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పారా లీగల్ వలంటీలర్లు బాష, ఆదినారాయణలు పాల్గొన్నారు.



మోటార్ సైక్లిస్ట్‌లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్

సాయిబాబా మార్గం అనుసరణీయం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 6: షిరిడీ సాయి బాబా బోధించిన ప్రేమ, సేవా మార్గం అనుసరణీయమని హైదరాబాదుకు చెందిన ఆధ్యాత్మిక వేత్త బీశెట్టి జ్యోతిరాజ్ అన్నారు. గురుపౌర్ణమి వేడుకలు పురస్కరించుకుని నెహ్రూ బజార్‌లోని షిరిడీ సాయి బాబా మందిరంలో శనివారం బాబా సూక్తులపై ఉపన్యసించారు. సాయిబాబా నిరాడంబర జీవితం గడిపారని అన్నారు. భగవంతుడు మానవజన్మలో జ్ఞానాన్ని ప్రసాదిస్తారని, ఆ జ్ఞానంతో మంచి, చెడు భేదం తెలుసుకుని జీవించాలన్నారు. సాయి ఉపవాసకులు సాయిదాసు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాలి గుణం కలిగి ఉండాలన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

బ్రాంచ్ ఎంపికే భవిష్యత్తుకు తొలిమెట్టు

ఘనంగా బ్రిలియంట్ ఇంజనీరింగ్ మాక్‌వెబ్ కౌన్సెలింగ్ • ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కల్చరల్), జూలై 6: ఇంజనీరింగ్ కోర్సుల్లో బ్రాంచ్ ఎంపికే భవిష్యత్తుకు తొలిమెట్టని, బీటెక్‌లో ప్రతి బ్రాంచ్ ఉత్తమమైనదేనని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని ఏ1 ఫంక్షన్‌హాలులో బ్రిలియంట్ కంప్యూటర్స్ ఏర్పాటు చేసిన ప్రత్యేక మాక్‌వెబ్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ షేక్ న్యామతుల్లాబాషా ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో దామచర్ల మాట్లాడుతూ ఇంజనీరింగ్, మెడికల్ వంటి కోర్సులతో మంచి భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీజీపీ కేఆర్ఎం.కిషోర్‌కుమార్ , జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బ్రిలియంట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తహూర, క్విస్ కళాశాలల అధినేత నిడమానూరి నాగేశ్వరరావు, గోరంట్ల రవికుమార్, రామ్‌ప్రసాద్, ఖలీఫాతుల్లాబాషా, పలు విద్యా సంస్థల అధినేతలు పాల్గొన్నారు.

అపార్టుమెంట్ పైనుంచి పడి వ్యక్తి మృతి

పొదిలి, జూలై 6 : పట్టణంలోని ఎస్ఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో నీళ్లట్యాంక్ శుభ్రపరిచేందుకు ట్యాంకుపైకెక్కిన కోమటికుంట్ల వెంకటసుబ్బయ్య(35) ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటసుబ్బయ్య తల్లిదండ్రులు అక్కడే వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటారు. ఎప్పుడైనా నీళ్లట్యాంక్ శుభ్రం చేయాలంటే సుబ్బయ్యను పిలుస్తుంటారు. ఆక్రమంలో శనివారం కూడా పిలిచి ట్యాంక్ శుభ్రం చేసే క్రమంలో ప్రమాదం జరిగిందని ఎస్ఐ కోటయ్య తెలిపారు. పొట్టకూటికోసం వచ్చి తిరిగిరాని లోకాలకు పోయాడని భార్య వరలక్ష్మీ కన్నీరు మున్నీరయ్యింది. వెంకటసుబ్బయ్యకు తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి నర్సమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతిచెందిన వెంకటసుబ్బయ్య

ఆయుర్వేదంతో అద్భుత చికిత్స

మార్కాపురం వన్‌టౌన్, జూలై 6: సిద్ధ ఆయుర్వేదంతో అద్భుత చికిత్స అందించవచ్చని ఆయుర్వేద వైద్యులు జగదీష్ అన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ సిద్ధ ఆయుర్వేదంతో మోకాళ్ల నొప్పులు, మెడ, నడుము నొప్పులకు చెక్ పెట్టవచ్చన్నారు. 120 మంది రోగులను పరీక్షించి వైద్యం అందించారు. సేవా భారతి ప్రతినిధులు రామ్‌గోపాల్, రామకృష్ణ, రామ్‌చరణ్, వెంకటేష్, అంజిరెడ్డి, అనూష తదితరులు పాల్గొన్నారు.

లొంగిపోయిన రైతులు

మార్కాపురం, జూలై 6: అన్ని వైపుల నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో మూడు రోజుల క్రితం మిర్చి వ్యాపారిని కిడ్నాప్ చేసి విడిచిపెట్టిన రైతులు ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయారు. శనివారం రాత్రి వారే నేరుగా పోలీసుస్టేషన్‌కు వచ్చారు. రెండు రోజులుగా పోలీసులు అధికారులు వారికైలిలో అన్ని వైపుల నుంచి వారి బంధువులపై ఒత్తిడి పెంచారు. తమకు న్యాయం చేస్తామంటే తప్పక లొంగిపోతామని వారు పోలీసులకు రాయబారం పంపారు. పోలీసు అధికారులు చట్టపరిధిలో తాము చేయాల్సిన విధంగా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు అంగీకరించి నేరుగా పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగిపోయారు. ఈ విషయమై సీఐ ఆవుల వెంకటేశ్వర్లును వివరణ కోరగా లొంగిపోయిన వారిని రిమాండ్ పంపుతున్నట్లు తెలిపారు. మొత్తం 9 మందికిగాను 8 మందిని ఇప్పటి వరకు అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులలో ప్రతిభను వెలికితీయాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 6: విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాలని టీచ్ టూల్ శిక్షణ రాష్ట్ర అబ్జర్వర్ ఎస్‌సీఈఆర్టీ ఎం.సోమశేఖర బ్రహ్మానందం అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ మాటలు, బోధన, నృత్యాల ద్వారా ఆకట్టుకుని ప్రభావశీలిగా మార్చాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని తరగతి గదిలో ఉపాధ్యాయులు ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్పీలు వెంకటేశ్వర్లు, సీహెచ్ శ్రీనివాసులు, నాగరాజు, ఎ.శ్రీనివాసులు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

కంభం, జూలై 6 : తురిమెళ్ళ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మార్కాపురం మూర్తి బుక్‌స్టాల్ యజమాని చల్లా పవన్‌కుమార్ శనివారం రాత పుస్తకాలు, బలపాలు, పెన్సిళ్లు విద్యార్థులకు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్‌నాయుడు, ఉపాధ్యాయురాలు కల్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కను నాటి సంరక్షించాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 6: మానవళికి అవసరమైన మొక్కను నాటి చెట్లను వృద్ధి చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణారావు అన్నారు. అమ్మకు వందనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని హ్యాపీ హోమ్స్‌లో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ చెట్లను నరకడం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతింటున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో ఆక్రమణల తొలగింపు

కనిగిరి, జూలై 6: కనిగిరి శివారులోని కాశిరెడ్డి కాలనీ హైవే వెంట జరిగిన ఆక్రమణలను రెండు రోజుల్లో తొలగిస్తామని జిల్లా కలెక్టర్‌కు కనిగిరి మున్సిపల్ కమిషనర్ శనివారం వివరణ ఇచ్చారు. గత ప్రభుత్వంలో కనిగిరిలో జరిగిన భూ ఆక్రమణలపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈక్రమంలో కనిగిరి పట్టణ శివారులోని 11వ వార్డు పరిధిలోని కాశిరెడ్డి కాలనీ వద్ద వైసీపీ కౌన్సిలర్లు భూ ఆక్రమణలకు పాల్పడిన విషయంపై శనివారం 'వైసీపీ కౌన్సిలర్ల చెరలో ప్రభుత్వ స్థలాలు' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ స్థానిక మున్సిపల్ కమిషనర్‌ను ఆక్రమణలపై వివరణ కోరారు. దీంతో కమిషనర్ ఆయా ఆక్రమణలను పరిశీలించి రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో రెండు రోజుల్లో తొలగిస్తామని పేర్కొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి

పామూరు, జూలై 6: ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే ప్రధాని అనే నినాదంతో కాశ్మీర్‌కు వెళ్లి ప్రాణ త్యాగం చేసిన గొప్ప దేశ భక్తుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. శనివారం జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జె.చినసుబ్బయ్య, ఉమ్మడి శ్రీను, పి.విజయకుమారచారి, చామల శ్రీనివాసులురెడ్డి, కోనేటి సతీష్, ఆకాష్, శ్రీరామ్ రామారావు, జి.నాగబాబు, బి.నగేష్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి

పామూరు, జూలై 6: మండలంలోని రేగిచెట్లపల్లి (వడ్డెపాలెం) రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఉగ్రకు గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. మోపాడు రిజర్వాయర్ ను పరిశీలించడానికి శనివారం రిజర్వాయర్ వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యే ఉగ్రను గ్రామస్థులు కలిశారు. 2018లో నాటి ప్రభుత్వం 1.89 కోట్ల అంచనా వ్యయంతో నిధులు మంజూరు చేసినా రోడ్డు నిర్మాణానికి స్థలం లేక పోవడంతో సాధ్య పడలేదన్నారు. రోడ్డు నిర్మాణానికి మంజూరు చేసిన నిధులను పంచాయతీ రోడ్డుకు బదలాయించి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరారు.

ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే పిల్లల్ని చేర్చాలి

దొనకొండ, జూలై 6: రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే పిల్లల్ని చేర్పించాలని ఎంఈవో సాంబశివరావు పేర్కొన్నారు. గుర్తింపు పొందిన పాఠశాలల్లో చేర్పిస్తే ప్రభుత్వం అందించే అన్నిరకాల పథకాలతో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎటువంటి ఇబ్బంది ఉండదని ఎంఈవో వివరించారు.

లయన్స్ క్లబ్ వితరణ

ముండ్లమూరు, జూలై 6: మండలంలోని ఉల్లగల్లులో లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో శనివారం రూ.40 వేలు విలువచేసే 150 కుర్చీలను ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా లయన్స్ క్లబ్ గవర్నర్ గోపీచంద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చందోలు వరప్రసాద్, విజయ కుమార్‌రెడ్డి, వీవీ సుబ్బయ్య, ఎం.రామాంజనేయులు, జేవీ రామారావు, పానుగంటి వెంకట సత్యనారాయణ గుప్తా, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన ఎన్‌ఏపీ చెరువు

- పనిచేయని ఫిల్టర్‌బెడ్లు
- కలుషిత నీరు తాగలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ పాలకులు

దర్శి, జూలై 6: దర్శి నియోజకవర్గ ప్రజలకు మంచి నీరు అందించే ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం నిర్వహణ లోపంతో అధ్వానంగా మారింది. గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ పాలకుల నిర్లక్ష్య వైఖరితో పథకం నిర్వీర్యమైంది. కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవటంతో ఇబ్బందికరంగా మారింది. ఏళ్ల తరబడి ఫిల్టర్ బెడ్లను మరమ్మత్తులు చేయలేదు. ఎన్‌ఏపీ చెరువు నీటి సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. స్కీమ్ ఏర్పాటై 40 సంవత్సరాలు గడినప్పటికీ ఒక్కసారి కూడా పూడిక తీయలేదు. దీంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి గ్రామాలకు మంచినీరు అందించలేకపోతున్నారు. చెరువు అడుగంటడంతో శివారు గ్రామాలకు నీరు అందటం లేదు.

ఎన్‌ఏపీ పథకం ద్వారా 121 గ్రామాలకు మంచినీరు అందించాల్సి ఉంది. చెరువులో అడుగు భాగాన ఉన్న నీటిని అరకొరగా విడుదల చేస్తున్నారు. ఫిల్టర్‌బెడ్లు పని చేయకపోవటంతో శుభ్రం చేయకుండా నేరుగా సంపునకు వదులుతున్నారు. ఎంతో కాలంగా నిల్వ ఉన్న అడుగు నీరు కలుషితమై రంగు మారిపోయింది. సంపులోకి వచ్చిన నీరు పరిశీలిస్తే మురికినీరు తలపించేలా ఉంది. సంపుల నుంచి పైపులైన్ ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఆనీరు తాగలేక ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు.

వైసీపీ పాలకులు గత ఐదు సంవత్సరాలుగా ఫిల్టర్ బెడ్లు, సంపు మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. కాలంచెల్లిన పైపులైన్లు తరచూ పగిలిపోతూ నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుంది. ప్రస్తుతం వేసవిని మరిపిస్తూ ఎండలు కాస్తుండటంతో ప్రజలు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. శివారు గ్రామాలకు మూడు రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారు. కనీసం బ్లీచింగ్ సక్రమంగా చల్లకుండా రంగుమారిన నీరు విడుదల చేస్తుండటంతో ఆనీరు తాగే వీలులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రక్షిత మంచినీటి పథకం బాగుపడుతుందని ప్రజలు భావిస్తున్నారు. పథకం అభివృద్ధికి నిధులు విడుదల చేసి పూర్వవైభవం తీసుకురావాలని అన్ని గ్రామాల కు నీరు సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవా లని ప్రజలు కోరుతున్నారు.


అడుగంటిన దర్శి ఎన్‌ఏపీ చెరువు


పనిచేయని ఫిల్టర్ బెడ్లు


పగిలిపోయి గోతాలు అడ్డుపెట్టి ఉన్న సంపు

త్వరితగతిన 'మోపాడు' ఆధునికీకరణ

- పూర్వవైభవం సంతరించేలా పనులు చేపట్టాలి
- ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆదేశం

పామూరు, జూలై 6: మెట్టప్రాంత వరప్రసాదిని మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణను త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పూర్వ వైభవం సంతరించేలా పనులు పూర్తిచేయాలన్నారు. శనివారం మండలంలోని మోపాడు రిజర్వాయర్‌ను ఇరిగేషన్ ఎస్ఈ నాగా మురళీమోహన్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ జైకో నిధులతో ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉండగా, గత ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో అరకొరగా జరిగాయన్నారు. తక్షణమే రిజర్వాయర్ కట్ట వెడల్పు పనులతో పాటు, జంగిల్ క్లియరెన్స్, తూము లీకే జి, పూడిక తీత పనులను చేపట్టాలన్నారు. ఈ ఏడాది రిజర్వాయర్ నీరు వృథా అయినప్పటికీ శాశ్వత పను లు చేపట్టాలన్నారు. అవసరమైతే ఇరిగేషన్ మంత్రి రా మానాయుడు దృష్టికి తీసుకెళ్లి అదనపు నిధులు మం జూరు చేయిస్తానని చెప్పారు. లస్కర్‌లను నియమించాలన్నారు. రైతు ప్రయోజనాలే తనకు ముఖ్యమని చె ప్పారు. అందుకోసమే వంద సంవత్సరాల మోపాడు చరిత్ర కలిగిన రిజర్వాయర్‌ను కాపాడుకోవడానికి నాడు నిధులు రాబట్టానన్నారు. గత పాలకులు ఇరిగేషన్ కోసం నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు.

ఈసందర్భంగా బొట్లగూడూరులో సుమారు 30 ఎక రాల్లో మినుము పైరు సాగు చేశానని, ఒక తడి నీరు వదలాలని గోపాల్ అనే రైతు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తూర్పుకట్టకిందపల్లి, పుట్టంనాయుడుపల్లి గ్రామాల మ ధ్యన ఉండే మెయిన్ కాలువపై రైతుల అవసరాల కో సం బ్రిడ్జి నిర్మించాలని అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, నీ రుకట్టు హరిబాబు కోరారు. అనంతరం 2021లో రిజర్వా యర్ కట్టకు ఏర్పడ్డ లీకేజి ప్రాంతాన్ని, అలుగు పగుల కొట్టిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పరిశీలించారు. అలుగు యథాతథంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రేణిమడుగుకు బస్సు సౌకర్యాన్ని పున రుద్ధరించాలని గ్రామానికి చెందిన కమ్మ బాలకృష్ణ, వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేను కోరారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మద్దిశెట్టి శ్రీధర్, యారవ శ్రీనివాసులు, ఎంహసేన్‌రావు యాదవ్, షేక్ ఖాజారహంతుల్లా, ఇర్రి కోటిరెడ్డి, కొలూరి ఖాజారహంతుల్లా, మాల్యాద్రి, ఖాజా మస్తాన్, గిద్దయ్య యాదవ్, అనపర్తి శశి, ఇ.కోదండరా మిరెడ్డి, ఇరిగేషన్ డీఈ రవి, ఏఈ శ్రీను, గంజిగుంట్ల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మోపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

శింగరకొండలో మొక్కులు చెల్లించుకున్న వీరమహిళలు

ముండ్లమూరు, జూలై 6: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించటంతో మండలంలోని ఈదర గ్రామానికి చెందిన వీర మహిళలు, ఆయన అభిమానులు శనివారం పాదయాత్రగా శింగరకొండ వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. 45 కిలో మీటర్లు పాదయాత్రగా వెళ్ళి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామికి 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఈదరతో పాటు భీమవరం, పూరిమెట్ల, అగ్రహారం, తమ్మలూరు, రావిపాడు, ముండ్లమూరు, వేంపాడు, శంకరాపురం, తిమ్మాయపాలెంలో ఉన్న టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, అభిమానులు ఈదర జనసేన వీర మహిళలను అభినందించారు.


శింగరకొండకు పాదయాత్రగా వెళుతున్న జనసేన వీరమహిళలు

సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్

వీసీపల్లి, జూలై 6: బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త అని టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు గుంటగాని జోసెఫ్ అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే మంత్రి కావడమే కాక దేశ ఉపప్రధాని అయ్యారని గుర్తుచేశారు. సామాజిక న్యాయం కోసం జగ్జీవన్‌రామ్ ఎంతో కృషిచేశారని అన్నారు. ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, వీరపనేని పెద్దన్న, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కోమటిగుంట్ల వీరయ్య, మూలె వెంకటేశ్వరరెడ్డి, మాదాసు చినబ్రహ్మయ్య, మూలె మహేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

పామూరు, జూలై 6: సమసమాజ స్థాపనకు కృషి చేసిన కృషీవలుడు దేశ తొలిప్రధాని బాబు జగ్జీవన్‌రాం అని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. దళిత ప్రజల హక్కులకై నినదించిన ధీశాలి అని పేర్కొన్నారు. జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమలంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఉప్పలపాటి హరిబాబు, షేక్ ఖాజారహంతుల్లా, ఎం.హసేన్‌రావు, నాయబ్ రసూల్, ఇర్రి కోటిరెడ్డి, డోలా శేషాద్రి, దేవరపు మాల్యాద్రి, జి.శ్రీను, పోకా వినోద్, తదితరులు పాల్గొన్నారు.


పామూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న టీడీపీ, బీజేపీ శ్రేణులు

పనితీరు మెరుగుపర్చుకోవాలి

- నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే చర్యలు
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 6: ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ ప్రకాశం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాదిరిగా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే ఇబ్బందులు తప్పవన్నారు. రికార్డుల్లో చూపించిన పనులు క్షేత్రస్థాయిలో జరగాలన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ ఇన్‌చార్జ్ ఏపీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం ద్వారా మామిడి, నిమ్మ, బత్తాయి, తైవాన్‌జామ, సపోటా, కొబ్బరి, చింత పండ్ల తోటలు సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహకాలు అందజేస్తుందన్నారు. విద్యుత్ ఏడీఈ ఉమాకాంత్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడైన విద్యుత్ లైన్ కింద మరో లైను, ఇంటికి ఆనుకుంటూ, ఇంటిపైన విద్యుత్ లైన్లు ఉన్నవారు మార్పు చేసుకునే వెసులుబాటు ఉందని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్నిచోట్ల లైన్ ఏర్పాటులో స్తంభం వేసే స్థలంలో మార్పులు చేసేందుకు గ్రామస్థులు నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. అలాంటివి తిరిగి తన దృష్టికి వస్తే సదరు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడతూ జేజేఎం పథకం కింద పనులు మంజూరైనట్లు తెలిపారు. వాటిలో హెడ్‌వర్కులు కింద రూ.17 కోట్లతో కొన్ని పనులు జరుగుతున్నాయన్నారు. నిధుల కొరతతో ఎక్కువ శాతం పనుల్లో జాప్యం వల్ల కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదని వివరించారు.

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ అక్రమంగా చెరువులు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని జలవనరులశాఖ ఏఈ, సీఐలను ఆదేశించారు. నాగులు చెరువులో ఆక్రమణలను వెలికితీయాలని ఆదేశించారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాలన్నారు. బాధ్యతాయుతంగా ప్రతి అధికారి నడుచుకున్నప్పుడే ప్రజలకు సంక్షేమ పాలన అందించటం సాధ్యమైతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో మహేష్‌బాబు, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

దొనకొండ, జూలై 6: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్ ప్రభావతీదేవి ఆధ్వర్యంలో మండలంలోని ఆరవల్లిపాడులో డెంగ్యూ వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. దోమల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చేతులను శుభ్రం చేసుకోవటంవల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే, ఒబ్బాపురం సచివాలయం-2 పరిధిలోం ఎంపీహెచ్ఏ నాగలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ కె.సంగీత ఆధ్వర్యంలో అతిసారపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి అతిసారపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యకేంద్రం సిబ్బంది

సచివాలయ సిబ్బందిపై మున్సిపల్ చైర్మన్ ఆగ్రహం


కనిగిరి, జూలై 6: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాల్సిన సచివాలయ సిబ్బంది గైర్హాజర్ కావటంపై మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్‌గఫార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 9వ సచివాలయాన్ని శనివారం మధ్యాహ్నం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసమయంలో సచివాలయ అడ్మిన్ తప్ప మిగతా సిబ్బంది ఎవరూ లేరు. దీంతో ఆయన అడ్మిన్ సుప్రియను సిబ్బంది గురించి ప్రశ్నించగా, భోజనానికి వెళ్లారని తెలిపారు. ఉదయం హాజరు రిజిస్టరులో సంతకాలు చేసి మధ్యాహ్న భోజనానికి వెళ్ళిన వారు ఎన్ని గంటలకు బయటికి వెళ్లారో మూమెంట్ రిజిస్టర్‌లో ఎందుకు రాయలేదని నిలదీశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలపై నిర్లక్ష్యంగా ఉండటంపై చైర్మన్ మండిపడ్డారు. ఈ విషయంపై మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేశారు. సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోనున్నట్లు చైర్మన్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దర్శి, జూలై 6: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో హనుమంతరావు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, కార్యదర్శులతో జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడారు.

వర్షాల సీజన్ ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో బ్లీచింగ్ చల్లటంతో పాటు వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ విధిగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బ్లెస్సీ, శ్రీనివాసరావు, చేతన్ తదితరులు పాల్గొన్నారు.





తుళ్లూరు లింగాయపాలెం రీచ్‌లో భారీగా నిల్వ ఉన్న ఇసుక లాట్లు



ఇసుక.. ఐదేళ్లుగా విసిగించింది. ఇసుక అందక భవన నిర్మాణదారులు అష్టకష్టాలు పడ్డారు. ఇసుక లేక పనులు జరగక కూలీలు ఉపాధి కోల్పోయారు. అలాగని ఇసుక తవ్వకాలు జరగలేదా అంటే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వైసీపీ నేతలు ఇష్టా రీతిన నదీగర్భాలను కుళ్ల బొడి చేశారు. ఇసుకాసురులుగా మారిన నేతలు పర్యావరణ అనుమతులను పట్టించుకోకుండా అధికార యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకుని రూ.కోట్లు బొక్కేశారు. చివరకు కోర్టులను కూడా మాయ చేసి రీచ్‌లను చెరపట్టి ఇసుకను టన్నుల్లో తవ్వి తరలించేశారు. ఒకవైపు స్థానికంగా ఇసుక అందక అల్లాడుతున్నా పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఇసుకపై దృష్టి సారించింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో బంగారంగా మారిన ఇసుక కష్టాలను తీర్చి ఇకపై పూర్తి స్థాయిలో ఉచితంగా అందు బాటులోకి తేచ్చేలా కూటమి ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇసుక బంగారం కాదు.. అందరికీ అందుబాటులో ఉండేలా చేసింది. ఉచితంగా ఇసుక అందివ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు కసరత్తు చేపట్టారు.

ఇసుక.. ఇక్కట్లకు తెర

ఐదేళ్ల కష్టాలు ఇక తీరినట్లే

- రేపటి నుంచి ఉచిత ఇసుక విధానం
- రీచ్‌లు, స్టాక్‌పాయింట్ల ఖరారుపై కలెక్టర్ల సమీక్ష
- రేపటి నుంచి మొదట వచ్చిన వారికి తొలిగా సరఫరా
- ఒకరికి రోజుకు 20 టన్నులు వరకు పరిమితి

నాడు దోపిడీ.. నేడు పారదర్శకంగా

ప్రకృతి వరప్రసాదమైన ఇసుక బంగారమైంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుకను దోచుకున్నారు. సామాన్యుడికి అందుబాటులో లేకుండా చేసి కోట్లు దండుకున్నారు. రీచ్‌ల పేరిట హడావిడి చేసి సామాన్యుడి నెత్తిన పెనుభారం మోపి ప్రభుత్వం చోద్యం చూసింది. ఇసుక దోపిడీ దెబ్బకు మధ్యతరగతి ప్రజలు ఇల్లు కట్టుకుందామన్న ఆలోచననే పక్కన పెట్టేశారంటే పరిస్థితి ఏవిధంగా తెలుసుకోవచ్చు. ఇక భవన నిర్మాణాల మీద ఆధారపడిన వేలాది మంది కార్మికులు పనులు లేక అల్లాడిపోయినా గత ప్రభుత్వం ఇసుక ఇక్కట్లపై దృష్టి సారించలేదు. కష్టనష్టాలకు ఓర్చి, అధిక మొత్తం చెల్లించి ఇసుకను కొనుగోలు చేసిన ఆ మొత్తాలు కూడా వైసీపీ నేతల జేబుల్లోకి చేరాయి తప్పితే ఖజానాకు జమ కాలేదు. ఏ చెల్లింపుల్లోనూ పారదర్శకత లేదు. ఏ రీచ్‌ల దగ్గర ప్రభుత్వ పర్యవేక్షణ లేదు. ఈ పరిస్థితుల్లో పూర్తి పారదర్శకంగా అందరికీ అందుబాటులో ఉండేలా ఇసుక విధానాన్ని కూటమి ప్రభుత్వం సోమవారం నుంచి అమలు చేయనున్నది. నేరుగా నగదు తీసుకునే అవకాశం లేకుండా లోడింగ్ ఛార్జీలను యూపీఐ/ఆన్‌లైన్‌లోనే చెల్లించేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇక ఎవరైతే స్టాక్‌యార్డు వద్దకు తొలిగా వస్తారో వారికే ముందు ఇసుకని సరఫరా చేస్తారు. లారీలను సీరియల్‌లో పెట్టించి లోడింగ్ చేయిస్తారు. ఆధార్‌ని ఎంట్రీ చేసుకుని ఒక్కో వ్యక్తికి రోజుకు 20 టన్నుల వరకు ఇసుక మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. ప్రతీ స్టాక్ పాయింట్ వద్ద సీసీ టీవీ కెమెరాలను అమర్చుతారు. ఉచిత ఇసుక విధానాన్ని దుర్వినియోగపరిచేలా వ్యవహరించే వారిపై జరిమానాలు విధించేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

తప్పు చేస్తే పెనాల్టీల వసూలు

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే భారీ మొత్తంలో పెనాల్టీలు వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ట్రాక్టర్‌కు తొలిసారి అయితే రూ.10 వేల వరకు, రెండో సారి అయితే రూ.10001 నుంచి రూ.20 వేల వరకు పెనాల్టీ వసూలు చేస్తారు. 10 టైర్ల లారీకి తొలిసారి రూ.25 వేలు, రెండో సారి రూ.25,001 నుంచి రూ.50 వేల వరకు పెనాల్టీ విధిస్తారు. 10 టైర్ల కంటే ఎక్కువ కలిగిన లారీకి తొలిసారి రూ.50 వేలు, రెండోసారి రూ.50001 నుంచి రూ.లక్ష వరకు విధిస్తారు. ఇతర యంత్రాలకు తొలిసారి రూ.50 వేలు, రెండోసారి రూ.50001 నుంచి రూ.లక్ష వరకు పెనాల్టీ ఉంటుంది. ఎద్దుల బండికి తొలిసారి రూ.2 వేలు, రెండోసారి రూ.3 వేలు, ఆ తర్వాత కూడా చేస్తే రూ.5 వేల చొప్పున పెనాల్టీ విధిస్తారు. బిల్లులు ఉండి ఎక్కువ మోతాదులో ఇసుక తరలిస్తే మెట్రిక్ టన్నుకు రూ. 2 వేల పెనాల్టీ వసూలు చేయనున్నారు.

నాడు ఉత్తిత్తి కమిటీలు.. నేడు బాధ్యతాయుతంగా..


వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన జిల్లా స్థాయి కమిటీలు ఇకమీదట క్రమం తప్పకుండా సమావేశమవడంతో పాటు ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించనున్నాయి. ఇదే సమయంలో బ్లాక్‌మార్కెట్‌పై కూడా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమాలను నియంత్రించేలా ఎక్కడికక్కడ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. వైసీపీ పాలనలో ఇసుక అడ్డగోలు దోపిడీని అరికట్టడానికి పకడ్బందీ వ్యవస్థ అంటూ ఏమీలేదు. అన్నింటినీ అలంకారప్రాయంగా మార్చింది. తనిఖీల కోసమంటూ వైసీపీ తీసుకొచ్చిన సెబ్ విధానం అబాసుపాలైంది. రెవెన్యూ, సెబ్ విభాగాలకు సమన్వయం కొరవడడంతో పాటు వాటి మీద వైసీపీ నేతలు ఎక్కిస్వారీ చేయడంతో అవి తన ఉనికిని చాటుకోలేక పోయాయి.

గుంటూరు, బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా అందరికీ ఇసుకను అందుబాటులోకి తెచ్చి నిర్మాణరంగాన్ని ప్రోత్సహించగా.. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసింది. దీంతో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇసుక అందక నిర్మాణదారులు పనులు నిలిపేశారు.. కూలీలు పనులు లేక అలమటించారు. ఇసుకాసురులుగా మారిన వైసీపీ నేతలు రూ.కోట్లు కొట్టేశారు. ఇసుకను బంగారంగా మార్చేశారు. రీచ్‌ల పేరిట హడావిడి చేసి సామాన్యుడి నెత్తిన ఇసుక విషయంలో పెనుభారం మోపి ప్రభుత్వం చోద్యం చూసింది. వారి కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఐదేళ్ల ఇసుక కష్టాలకు చెక్‌పెడుతూ కూటమి ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. ఈ క్రమంలో ఉచిత ఇసుకకు సంబంధించిన విధివిధానాలపై గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా యంత్రాంగాలు కసరత్తు ప్రారంభించాయి. శనివారం జిల్లా స్థాయి ఇసుక కమిటీలతో కలెక్టర్లు ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహించారు. మైనింగ్, కృష్ణానది సంరక్షక విభాగం, పోలీసు, రెవెన్యూ, రవాణా తదితర శాఖల అధికారులతో ఆయా జిల్లాల కలెక్టర్లు చర్చించారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడెక్కడ ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి, వాటిల్లో ఎన్ని మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నది అనేది తెలుసుకున్నారు. తక్షణమే ఆయా స్టాక్ పాయింట్లను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇసుక ధరని ఆదివారం నిర్ణయించి ప్రజలకు తెలియజేసిన అనంతరం సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకొద్దామని చెప్పారు. ఆ మేరకు ఆయా శాఖలు ఏర్పాట్లు ప్రారంభించాయి. ఇసుక రవాణా ఛార్జీలను కిలోమీటర్‌కు ఎంత అనేది నిర్ణయం చేయాలని రవాణా శాఖ అధికారులకు కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లోడింగ్, రవాణా ఛార్జీలు ఎంత అనేది ప్రకటిస్తారు. ప్రస్తుతానికి రీచ్‌ల జోలికి పోకుండా కేవలం స్టాక్‌యార్డుల్లో ఉన్న ఇసుకని ప్రజలకు ఉచితంగా సరఫరా చేయడం పైనే దృష్టి పెట్టాలని అధికారులు నిర్ణయించారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో బృందాలు ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుకని తరలించకుండా చర్యలు చేపట్టనున్నారు. కాగా త్వరలో ఎక్కడెక్కడ ఇసుక పూడిక తొలగించొచ్చు అనేది అధికారులు గుర్తిస్తారు. పట్టా భూముల్లో ఇసుక మేటలు వేసి ఉంటే వాటిని కూడా గుర్తించి అక్కడ ఇసుకని తీసి స్టాక్ పాయింట్ల వద్దకు చేరుస్తారు. వీటి వద్ద నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. ప్రస్తుతానికి ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుకని తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. ఆయా ప్రాంతాల్లో చిన్న కార్యాలయాలు తెరిచి సిబ్బందిని అందుబాటులో ఉంచే అవకాశం ఉంది. పోలీసు, రెవెన్యూ విభాగాలు స్టాక్ పాయింట్ల వద్ద పర్యవేక్షించనున్నాయి. రెండు స్టాక్ పాయింట్లకు ఒకరు చొప్పున మైనింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు.

వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన జిల్లా స్థాయి ఇసుక కమిటీలు ఇకమీదట క్రమం తప్పకుండా సమావేశమవడంతో పాటు ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించనున్నారు. ఇదే సమయంలో బ్లాక్‌మార్కెట్‌పై కూడా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమాలను నియంత్రించనున్నారు. సోమవారం నుంచి కూటమి ప్రభుత్వం తీసుకురానున్న ఉచిత ఇసుక విధానంపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యుడి సొంతింటికలకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో ఉపకరిస్తుందని, రోజువారీ పనిచేసుకుని బతుకునీడ్చే కార్మికుల ముఖాల్లో కూడా ప్రభుత్వ నిర్ణయంపై ఆనందం కనిపిస్తోంది.

ఆరు చోట్ల స్టాక్ పాయింట్లు

బాపట్ల: జిల్లాలో ఆరు ఇసుక స్టాక్‌పాయింట్ల వద్ద 72,736 మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయానికి సిద్ధంగా ఉందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం జరిగింది. బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్‌యార్డులోని స్టాక్ పాయింట్‌లో 15,450 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. వేటపాలెం జాతీయ రహదారి వద్ద 4,053 మెట్రిక్‌టన్నులు, అద్దంకి మండలం అనమనమూరులో 10,374 మెట్రిక్‌టన్నులు, అద్దంకి తిమ్మాయపాలెంలో 5,103 మెట్రిక్‌టన్నులు, మార్టూరులో 2,897 మెట్రిక్‌టన్నులు, కొల్లూరు మండలం జువ్వలపాలెంలో 34,859 మెట్రిక్‌టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద లోడింగ్‌కు టన్నుకు రూ.20 ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇసుకకు సంబంధించి మండల స్థాయిలో ప్రత్యేక బృందాలను నియమిస్తామన్నారు. సోమవారం ఉదయం 6 గంటలు నుంచి ఇసుక ఉచితంగా అందిస్తామన్నారు. రేవుల వద్ద లోడింగ్, ప్రయాణ ఖర్చులు మాత్రమే ఉంటాయన్నారు. ఇసుక సమాచారాన్ని మైన్స్ అండ్ జీయాలజి వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. వినియోగదారులు ఆధార్, ఇతర ధ్రువీకరణపత్రాలు చూపి ఇసుక తీసుకోవచ్చన్నారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా నిర్మాణదారులకు భారంలేకుండా ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఇసుక అక్రమాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నల్లబజారులో ఇసుక అక్రమ విక్రయాలను అరికట్టాలన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే అధికారులు చర్యలు తీసుకోవాలని లేకుంటే అధికారులే బాధ్యులౌతారన్నారు. సచివాలయ సిబ్బందితో ఒకరిని స్టాక్ పాయింట్ వద్ద నియమించాలన్నారు. 24 గంటలపాటు పోలీసులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, గనులశాఖ ఏడీ రాజేష్, డీపీవో సురేష్ రవికుమార్, ఆర్డీవోలు, డీఎస్పీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఇసుక నూతన విధానంపై అధికారులతో సమావేశమైన కలెక్టర్ వెంకటమురళీ

రాజధానిలో ఇసుక కొండలు

- రీచ్‌లను పరిశీలించిన అధికారులు

తుళ్లూరు: రాజధాని పరిధిలోని గ్రామాల్లో అధికారులు ఇసుక కొండలను గుర్తించారు. మండల పరిధిలోని రాయపూడి, లింగాయపాలెం, తాళ్లాయపాలెం ఇసుక రీచ్‌లను అధికారులు శనివారం పరిశీలించారు. ఆయా రీచ్‌ల్లో ఉన్న నిల్వలను పరిశీలించారు. రాయపూడి రీచ్‌లో నీటి నుంచి ఇసుక తీసే అవకాశాలున్నాయని, మేటలు కూడా ఉన్నాయని అధికారులు గుర్తించారు. లింగాయపాలెంలో డ్రెడ్జింగ్ చేసి నిల్వ వేసిన నాలుగు భారీ ఇసుక లాట్లను పరిశీలించారు. తాళ్లాయపాలెం పుష్కరఘాట్ వద్ద డంప్ చేసిన ఇసుకను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు సుధీర్, ఎంపీడీవో శివన్నారాయణ, సర్వేయర్ రామాంజనేయులు, ఆర్ఐ భవానీకిరణ్, తుళ్లూరు సీఐ-2 అనురాధ, ఎస్ఐ అంకమ్మ, ఎస్ఈబీ సీఐ ప్రసన్నలక్ష్మి, ఎస్ఐ రాజేంద్ర, వీఆర్వో కోటేశ్వరావు తదితులున్నారు.



బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్టాక్‌పాయింట్‌లో ఉన్న ఇసుక నిల్వ



లింగాయపాలెం రీచ్‌లో నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధీర్, ఎంపీడివో సర్వే, ఎస్ఈబీ అధికారులు

పీహెచ్‌డీ.. రూ.10 లక్షలు

- ఏఎన్‌యూలో పట్టాలు, పదవుల అమ్మకం
- స్కాలర్స్ నుంచి వైవాకు రూ.వేలల్లో వసూలు
- వైసీపీ వారికే పదవులు.. అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులు

చదివితే కాదు.. పైసలతో డిగ్రీలు

గుంటూరు(విద్య), జూలై 6: విద్యకు ఆలయంగా ఉండాల్సిన వర్సిటీలు వైసీపీ హయాంలో అక్రమాలకు అడ్డాగా మారాయి. పైసలు, వైసీపీ నేతల అండతోనే పదవులతో పాటు డిగ్రీలు కూడా పంపిణీ చేశారు. సాధారణంగా పీహెచ్‌డీ రావాలంటే ఏళ్లుగా ఆ అంశంపై పరిశోధనలు చేసి.. అందులో నిష్ణాతులుగా మారి.. వివిధ పరీక్షలు ఎదుర్కొని.. తమ మేధస్సుతో పలువుర్ని మెప్పించాలి. కానీ వైసీపీ హయాంలో అలాంటి వాటితో సంబంధం లేకుండానే యథేచ్ఛగా పీహెచ్‌డీల ప్రదానం జరిగింది. ఈ కోవలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కూడా చేరినట్లు విమర్శలు, ఆరోపణలున్నాయి. నాగార్జున విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ విభాగంలో రోజుకో కొత్త దందా వెలుగు చూస్తోంది. పీహెచ్‌డీ కోసం వచ్చే దరఖాస్తుదారులు వర్సిటీకి రూ.వేలల్లో ఫీజులతో పాటు గైడ్లకు లక్షలు ముట్టచెప్పినట్లు పలువురు స్కాలర్లు వాపోతున్నారు. కొంతమంది గైడ్‌లు థీసెస్ రాయించడానికి స్కాలర్స్ నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేశారని సమాచారం. కొంతమంది గైడ్లు తాము చెప్పిన వారి దగ్గరే థీసెస్ రాయించమని స్కాలర్స్‌పై ఒత్తిడి తెచ్చి 50 శాతం తీసుకున్నట్లు సమాచారం. మరికొందరు థీసెస్ మీద సంతకాలకు రూ.3 లక్షల వరకు వసూలు చేశారని స్కా లర్స్ ఆవేదన. ఎడ్యుకేషన్ విభాగంలో ఓ అధికారికి రూ.10 వేలు ఇస్తేకానీ వైవాలో ప్రశ్నలు అడగరని ప్రచారం ఉంది. మరో అధి కారి కారు చార్జీలు, మూడు నక్షత్రాల హోటల్‌లో విందులంటూ స్కాలర్స్‌ను పిండేశారు. మరికొందరు వైవాకు హాజరు కావాలంటే రూ.20 వేలు ఇవ్వాలని హుకుం జారీ చేస్తు న్నారు. సెమినార్స్ సందర్భంగా రూ.5 వేల నుంచి రూ.25 వేలు దండుకుంటున్నారు. ఇలా వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాలంటే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతున్నట్లు స్కాలర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వీర విధేయులకే పదవులు..

వర్సిటీ ఎడ్యుకేషన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో ఒక్కరు తప్ప మిగతా అందరూ వైసీపీకి వీర విధేయులే అనే ప్రచారం ఉంది. టీడీపీ వారికి పదవులు ఇవ్వొద్దని ఓ మాజీ అధికారిణి వీసీకి లేఖ ఇచ్చినట్లు సమాచారం. మాజీ మంత్రి అండతో మరో అధికారిణి ప్రతి పనికి రేటు కట్టి వసూళ్లకు తెగబడుతున్నట్లు ఆరోపణ లున్నాయి. గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను బహిరంగంగా విమర్శించడం తోనే ఈమెకు పదవి దక్కినట్లు ప్రచారం.

అక్రమాలు ప్రశ్నిస్తే వేధింపులే..

ఎడ్యుకేషన్ విభాగంలో జరిగే అక్రమాలను పశ్నిస్తే వేధింపులకు గురిచేస్తున్నారని స్కాలర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమందిపై అక్రమంగా కేసులు కూడా బనాయించారు. ఓ అధ్యాపకుడిపై అట్రాసిటీ కేసు పెడితేనే మీ బంధువుకు పీహెచ్‌డీ వస్తుందని డీఎస్పీ స్థాయి అధికారిని ఓ గైడ్ బెదిరించినట్లు సమాచారం. కుల సంఘాల నేతలతో దాడులు సర్వసాధారణమయ్యాయని స్కాలర్స్ వాపోతున్నారు.

సోలార్ ప్లాంట్లకు ప్రోత్సాహం

- విద్యుత్ వ్యవస్థలను నాశనం చేసిన వైసీపీ
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్


అద్దంకి, జూలై 6: కేంద్ర ప్రభుత్వ సహకారంతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి మున్సిపాలిటీలో అధికారులతో శనివారం మంత్రి సమీక్షించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఆసక్తి చూపితే ప్రైవేటు భవనాలపై కూడా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేరళలో సోలార్ ప్లాంట్లు బాగా ఏర్పాటు చేశారన్నారు. టీడీపీ హయంలో ప్రజలకు మేలు జరిగే సంస్కరణలతో మిగులు విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ వ్యవస్థలను సర్వనాశనం చేసిందన్నారు. అన్నింటినీ ప్రక్షాళన చేసి ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 46వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామన్నారు. అవినీతి అధికారులను ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి గొట్టిపాటి

ఎవరీ బాలు.. ఎందుకా ప్రాధాన్యం

- టీడీపీ నేతపై దాడి.. టీడీపీ అధిష్ఠానం ఆరా



బాధితుడు నక్కల రమణారావు

చీరాల, జూలై 6: చీరాలలో బాలూ యాదవ్ అనే కానిస్టేబుల్ ఏకంగా పార్టీ కార్యాలయంలోకి ప్రవేశించి సీనియర్ నేత నక్కల రమణారావుపై దాడి చేయడంపై అధిష్ఠానం ఆరా తీస్తుంది. ఎవరీ బాలూయాదవ్.. అతడికి ఎందుకు నేతలు ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. టీడీపీలోని మిగిలిన నేతలకు కూడా ఈ బాలు విషయం అంతుబట్టడంలేదు. టీడీపీ కార్యాలయంలో మూడు రోజుల క్రితం రమణారావుపై బాలు అనే కానిస్టేబుల్, మరో ఆరుగురుతో కలిసి దాడి చేయడం సంచలనంగా మారింది. సాక్షాత్తు టీడీపీ కార్యాలయంలో సీనియర్ నేతపైనే దాడి చేయడం దేనికి సంకేతమని ప్రజల్లో జోరుగా చర్చ సాగుతోంది. సామాజికంగా, ఆర్థికంగా బలమైన రమణారావు లాంటిపై వ్యక్తిపైనే దాడి జరిగితే తమ పరిస్థితి ఏమిటని పార్టీకి తొలి నుంచీ వెన్నుదన్నుగా ఉన్న నాయకులు ఆందోళన చెందుతున్నారు.

కానిస్టేబుల్‌పై చర్యలు

దాడిలో గాయపడిన బాధితుడు రమణారావు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కానిస్టేబుల్ బాలు యాదవ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జరిగిన పరిణామాలను పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందాల్ సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.



మ్యాన్ హోల్స్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

మురుగు కాలువలపై దృష్టి సారించాలి

చీరాలటౌన్, జూలై 6 : మునిసిపల్ పరిధిలోని మురుగు కాలువలపై ప్రత్యేక దృష్టిసారించి సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. శనివారం సిబ్బందితో కలిసి కమిషనర్ పట్టణంలో పర్యటించారు. ఈసందర్భంగా మ్యాన్‌హోల్స్ వీధుల్లో డ్రైన్‌లు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా సేవలు అందించాలని సూచించారు. కమిషనర్ వెంట డీఈ ఏసయ్య, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు



రేషన్ షాప్‌ను తనిఖీ చేస్తున్న డీటీ గీతారాణి

చినగంజాం, జూలై 6 : మండలంలోని చినగంజాంలో చౌక ధరల దుకాణం డీలరుపై 6ఏ కేసు నమోదు చేసినట్లు చీరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ జే.గీతారాణి తెలిపారు. డీటీ తెలిపిన వివరాలు ప్రకారం.. చినగంజాంలోని పాదర్తి దేవదానకుమార్ చెందిన చౌక ధరల దుకాణం నెంబరు 0846003ని శనివారం తనిఖీ చేసినట్లు తెలిపారు. దుకాణంలోని స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేయగా 5,200 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉండాల్సి ఉండగా, దానిలో 21.25 క్వింటాళ్ల బియ్యం తగ్గినట్లు తెలిపారు. స్టాకు రిజిస్టర్‌లో తగ్గిన పీడీఎస్ బియ్యానికి సరైన ఆధారాలు లేకపోవడంతో రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి బండారు దానియేలు, వీఏలు పాల్గొన్నారు.

పర్యాటకం.. పరిహాసం!

- పరిష్కారమా.. పట్టుదలా!
- జిల్లాలోని తీరప్రాంతంలో ఆంక్షలు
- బోసిపోతున్న తీరం
- కొనసాగుతున్న పోలీస్ పికెట్లు

చీరాల, జూలై 6: జిల్లాలోని తీరప్రాంతంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. పర్యాటకం పరిహాసంగా మారిందని స్థానికులతో పాటు, ఇతర ప్రాంతాలవారు కూడా చర్చించుకుంటున్నారు. గత నెల 23న తీరంలో జరిగిన విషాద ఘటనలు అందుకు కారణం. బాపట్ల జిల్లాలో సూర్యలంక, వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం వరకు పర్యాటకరంగపరంగా పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. వారంలో శని, ఆదివారాలు తీరం సందడిగా ఉంటుంది. అయితే, గత నెల 23వ తేదిన వేటపాలెం మండలం రామాపురం తీరంలో సముద్రంలో పలువురు గల్లంతయ్యారు. ఆ తరువాత వారి మృత దేహాలు ఒడ్డుకు చేరాయి. అంతకుముందు కొద్దిరోజుల వ్యవధిలో వరుస ఘటనలు జరిగాయి. ఈక్రమంలో జిల్లా వ్యాప్తంగా తీరప్రాంతంలో పర్యాటకులను నిషేధించారు.

జిల్లాలో విస్తారంగా తీరప్రాంతం ఉంది. అభివృద్ధి చేస్తే ఆంధ్రా గోవాగా తీరం అభివృద్ధి చెందుతుంది. ఇది పర్యాటకుల మాట. అయితే టూరిజం పరంగా అభివృద్ధి చెందాలంటే పర్యాటకుల ఆదరణ అవసరం. అయితే, గత కొంతకాలంగా జిల్లాలోని తీరప్రాంతంలో జరిగిన ఘటనలపై పాలకులు, అధికారులు తీసుకున్న చర్యలు విమర్శలకు తావిస్తోంది. జిల్లాలోని తీరప్రాంతం పరిధిలో చిన్నా, పెద్దా రిసార్ట్స్ సుమారు 50 వరకు ఉన్నాయి. అందులో చీరాల నియోజకవర్గం పరిధిలో 29 ఉన్నాయి. అన్ని రిసార్ట్స్‌లో కలిపి సుమారు 300 రూములు ఉంటాయి. ప్రతి వారంలో వారంత పు సెలవు దినాల్లో దాదాపు రూములన్నీ పర్యాటకులతో నిండుతాయి. కొన్ని రిసార్టులకు విడి రోజుల్లో కూడా తాకిడి ఉంటుంది.

ఏం జరుగుతోంది...?

తీరప్రాంతంలో జరుగుతున్న విషాధ సంఘటనలకు పరిష్కారం అవసరం. అయితే దీన్ని సాకుగా చూపి పూర్తిస్థాయిలో పర్యాటకులకు అడ్డుకట్ట వేయటం ఎంతవరకు సమంజసం. ప్రస్తుతం జనాల్లో జరుగుతున్న చర్చ ఇది. ఈవిషయమై అటు రాజకీయ వర్గాల్లోను ఇటు ప్రజల్లోను భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలాఉంటే ఆయా ప్రాంతాల్లోని రిసార్టులు, హోటల్స్ నిర్వాహకుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పరిష్కారమా.. పట్టుదలా..

జరిగిన పరిణామాల క్రమంలో జరిగిన ప్రాణనష్టాన్ని ఎవరు భర్తీ చేయలేరు. అయితే భవిష్యత్‌లో అలాంటి ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవటం శుభపరిణామం. దీన్ని అందరు స్వాగతించాల్సిన అవసరం ఉంది. అయితే అందుకు సంబంధించిన కార్యాచరణ జాప్యంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

బ్లూ ఫాగ్ ఆటంకంగా మారేనా...?

రామాపురం తీరంలో బ్లూఫాగ్ జోన్‌పై ఇప్పటికే ఒకటికీ పలుమార్లు అధ్యయనాలు జరిగాయి. జిల్లాలోని తీరప్రాంతంలో అదే అనువైన ప్రదేశంగా గుర్తించినట్లు ప్రాథమిక సమాచారం. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు అందుకు ప్రతికూలంగా భావించే పరిస్థితని సమాచారం. ఇప్పటికి రెండు పర్యాయాలు బ్లూఫాగ్ టీం అధ్యయనం చేశారు. భవిష్యత్ కార్యాచరణ ఇక్కడి స్థితిగతులపై ఆధారపడి ఉంటుందని సంబంధీకులు భావిస్తున్నారు.



రామాపురం తీరంలో సముద్రంలోకి వెళ్లకుండా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు(ఫైల్)

రాజకీయమా ... రక్షణ చర్యలా ...?

జరిగిన విషాద సంఘటనల నేపథ్యంలో భద్రతా చర్యలు చేపట్టటం హర్షనీయం. అయితే కొందరు రాజకీయంగా వేస్తున్న అడుగులు రక్షణ చర్యలకా, ఆధిపత్య పోరా అనే కోణంలో కూడా అటు రిసార్ట నిర్వాహకులతో పాటు ఇటు పర్యాటకులు, ప్రజల్లోను చర్చ జరుగుతోంది. ఈక్రమంలో గత రెండు వారాలుగా తీరంలో విధించిన నిషేధాజ్ఞలతో కోట్ల రూపాయల లావాదేవీలు ఆగాయి. దీంతో కొందరికి ఉపాధి కూడా కొరవడింది. ఈక్రమంలో నెలకొన్న పరిస్థితులు రాజకీయంగా రూపాంతరం చెందుతాయా... లేకుంటే అంతా సవ్యంగా నిర్ణయాలు ఉంటాయా అనే అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంమీద పాలకుటు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

పాలకవర్గానికి పట్టణాభివృద్ధి పట్టదా!

- మంత్రి సమీక్షకు అద్దంకి మున్సిపల్ చైర్‌పర్సన్, వైసీపీ కౌన్సిలర్‌లు డుమ్మా
- హాజరైన వైస్‌చైర్మన్



మంత్రి రవికుమార్ సమీక్షా సమావేశానికి హాజరైన వైస్ చైర్మన్ దేసు పద్మేష్, పలువురు కౌన్సిలర్‌లు

అద్దంకి, జూలై 6 : అద్దంకి పట్టణ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాల్సిన మున్సిపల్ పాలక పక్షం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ విద్యుత్ శాఖ మంత్రి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం నిర్వహించిన సమీక్షకు హాజరు కాకపోవడంపట్ల విమర్శలు వస్తున్నాయి. పట్టణాభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికపై అధికారులతో మంత్రి సమీక్షను ఏర్పాటుచేశారు. రాజకీయపార్టీలతో సంబంధం లేకుండా చైర్‌పర్సన్‌తో పాటు అందరు కౌన్సిలర్లు హాజరు కావాల్సి ఉండగా, కొందరు డుమ్మా కొట్టడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ తప్పని సరిగా హాజరుకావాల్సిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చైర్‌పర్సన్‌తో పాటు పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు హాజరుకాకపోవడం ద్వారా భవిష్యత్‌లో అభివృద్ధికి అడ్డంకిగా నిలుస్తారనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అధికారులతో నిర్వహించే సమీక్ష కాబట్టి అందరు కౌన్సిలర్‌లు వచ్చిఉంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. టీడీపీ కౌన్సిలర్ లు మాగులూరి తిరుపతమ్మ, కంపా రజని, సీతమ్మ, రంగిశెట్టి సుభాషిణి, అత్తులూరి రమేష్, జహీరా, అంకం తేజశ్వనితో పాటు ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కౌన్సిలర్‌లు విజయలక్ష్మి, ఏజెండ్ల నాగరాజు హాజరయ్యారు. సమీక్షా సమావేశం జరిగే సమయంలో వైస్ చైర్మన్ దేసు పద్మేష్ హాజరు కావటం చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పద్మేష్ ఒక్క రోజు కూడా తిరగకుండానే మరలా వైసీపీ గూటికి చేరారు. ఈక్రమంలో మంత్రి సమీక్షకు హాజరుకావడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీ హయాంలో మున్సిపల్ పాలకవర్గంలో అన్నీతానై వ్యవహరించిన వైస్ చైర్మన్ దేసు పద్మేష్‌పై పలు అవినీతి ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో పద్మేష్ రావడం ద్వారా భవిష్యత్‌లో తన జోలికి రాకుండా చేసుకునేందుకే హాజరై ఉంటారని పలువురు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్‌లో మరికొందరు వైసీపీ కౌన్సిలర్‌లు టీడీపీ గూటికి చేరే అవకాశం ఉండడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టి మార్పు జరిగే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తం మవుతున్నాయి.

మంత్రికి వినతుల వెల్లువ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం గొట్టిపాటికి పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన ప్రజలు వినతి పత్రాలను అందజేశారు. ప్రధానంగా రెవెన్యూ, విద్యుత్ సమస్యలతో పాటు మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సుమారు 150 మందికి పైగా మంత్రికి వినతులు ఇచ్చారు. అదే సమయంలో ఏపీఎన్‌జీవోల సంఘం ప్రతినిధులు, గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు, 98 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులు, 108 సిబ్బందితో పాటు పలువురు మంత్రికి శుభాకాంక్షలు చెప్పి సమస్యల పరిష్కారం కోసం అర్జీలను అందజేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కాకాని అశోక్, కుందారపు రామారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, మాజీ ఎంపీపీ మన్నెం ఏడుకొండలు, లహరి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పరిమి దయామణి, చిన్ని హనుమా, దామా సురేంద్ర, మాదవరావు తదితరులు పాల్గొన్నారు. చీరాల ఆర్టీసీ డీఎం, అద్దంకి ఇన్‌చార్జి డీఎం శ్యామల మంత్రికి పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

రాతి ముఖమండపానికి విరాళాలు

అద్దంకి, జూలై 6 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ రాతి ముఖ మండపం నిర్మాణానికి శనివారం దాతలు విరాళాలను అందజేశారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం బొద్దికూరపాడుకు చెందిన రావినూతల వెంకట సుందరమనోజ్‌కుమార్, మంగాయత్రి దంపతులు రూ.లక్ష అందజేశారు.

అలాగే, పల్నాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన తురుమెళ్ల వెంకటసుబ్బారావు, విజయలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళాన్ని శనివారం దేవాలయ సిబ్బందికి అందజేశారు.

మార్చేశారు..!

- పథకాల పేర్లు మారిపోయాయి
- జగనన్న పోయి అంబేడ్కర్ వచ్చే!
- కొత్త ప్రభుత్వ చర్యలు ప్రారంభం
- ఉత్తర్వులు జారీచేసిన సర్కారు
- గత ప్రభుత్వంలో అంతా అడ్డగోలే
- సంక్షేమ పథకాలకు తిరిగి పాత పేర్లే

రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల పేర్లను మార్చేసింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటిదాకా రాష్ట్రంలో అమలులో ఉన్న ప్రతి పథకం పేరును ఇష్టారీతిన మార్చేసింది. పేదలకు పింఛన్లు పంపిణీ, బడుగు విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్పులు, కల్యాణమస్తు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అందించే పోషకాహార పథకం వంటి అన్ని రకాల సంక్షేమ పథకాలకు పేర్లు మార్చేసింది. అంబేడ్కర్ విదేశీ విద్య పథకం పేరు అయితే తొలగించి ఏకంగా వైసీపీ అధినేత జగన్ పేరు పెట్టకోవడం కొసమెరుపు. అయితే ఆ పేర్లన్నీ ప్రస్తుతం మారిపోయాయి.

ఒంగోలు నగరం, జూలై 6: ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో ప్రజలు జగన్ సర్కార్‌ను తిప్పికొట్టారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే తీర్పు ఇలాగే ఉంటుందని తగిన బుద్ధి చెప్పారు. ఇందుకు రంగులు, పేర్ల పిచ్చి కూడా ఒక కారణమే. కాగా కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే సంక్షేమ పథకాల అమలుపై దృష్టిపెట్టింది. అయితే గత ప్రభుత్వం పథకాల పేర్లను ఇష్టారీతిన మార్చివేసిన విషయం తెలిసిందే. ఎంతోకాలంగా ఎన్టీఆర్ పేరుతో ఉన్న ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరును కూడా వైఎస్సార్ పేరుతో వైసీపీ ప్రభుత్వం మార్చేసింది. ఇంతెందుకు ప్రపంచ మేధావి అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో నాటి తెలుగుదేశం పార్టీ అమలు చేసిన అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం పేరును నాటి ముఖ్యమంత్రి పేరుతో జగనన్న విదేశీ విద్య పేరుగా మార్చేసి అమలు చేసేందుకు బరితెగించింది. దీంతో రాష్ట్రంలోని కోట్లాది మంది దళితుల మనోభావాలను దెబ్బతీసింది గత వైసీపీ ప్రభుత్వం. మొదటగా హెల్త్ యూనివర్సిటీకి వైఎస్సార్ పేరు తొలగించి తిరిగి పాత పేరు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అని పెట్టారు.

ఇక అంబేడ్కర్ విదేశీ విద్య..

ఈ నెలలో రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల పేర్లను పూర్తిగా మార్చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఎంతోకాలంగా అంబేడ్కర్ పేరుతో అమలు జరుగుతున్న విదేశీ విద్యా పథకానికి జగనన్న పేరును తొలగించి తిరిగి పాత పేరుతోనే అమలు చేస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో పేదలకు పింఛన్లు అందించే పథకానికి వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుక పేరుతో అమలుచేయగా ప్రస్తుత ప్రభుత్వం గతంలో ఈ పథకానికి ఉన్న ఎన్టీఆర్ భరోసా పేరుతో అమలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ పథకం కింద జిల్లాలోని దాదాపు రెండున్నర లక్షలమంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు నెలవారీ పింఛన్లు పొందుతున్నారు. ఈ పథకం ఇక నుంచి ఎన్టీఆర్ భరోసా పేరుతోనే అమలు చేయనున్నారు.

పెళ్లికానుక, బాలసంజీవని..

బడుగు విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్పులు, మెస్ చార్జీలు చెల్లించే పథకం ఇప్పటి వరకు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పేర్లతో అమలు జరిగేవి. ఇప్పుడు వాటిని పోస్టు మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్పు అనే పేర్లతో అమలు చేయబోతున్నారు. అదేవిధంగా పేద జంటలు వివాహం చేసుకుంటే వారికి అందించే ఆర్థిక సహాయానికి వైఎస్సార్ కళ్యాణమస్తు పేరుతో అమలు జరిపేవారు. ఇప్పుడు ఈ పథకానికి చంద్రన్న పెళ్లికానుక పేరుతో అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దేశంలోనే అత్యున్నత సర్వీసులైన సివిల్ సర్వీసు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించే పథకానికి గత ప్రభుత్వం జగనన్న జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పేరుతో అమలు చేయగా ఇప్పుడు ఈ పథకానికి ఇన్‌సెంటివ్స్ ఫర్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్ పేరుతో అమలు చేయనున్నారు. స్త్రీశిశు సంక్షేమశాఖ ద్వారా అమలు జరుగుతున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలు బాలసంజీవని పథకంగా మార్చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

తిరిగి వెలుగుగానే..

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వెలుగు-డీఆర్‌డీఏ పేరును కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరక్రాంతి పథకం అని, వైసీపీ ప్రభుత్వం వైయస్సార్ క్రాంతిపథం అన్నిపేర్లు మార్చేసి పథకాలను అమలుచేశారు. అయితే ఏ ప్రభుత్వం వచ్చినా ఎన్ని పేర్లు పెట్టినా వాడుకలో దీన్ని వెలుగు అనే పేరుతోనే పిలుస్తున్నారు. కాగా వెలుగు పథకం ద్వారా పొదుపు సంఘాల మహిళలకు సున్నావడ్డీ పథకం, రుణమాఫీ, జగనన్న ఆసరా, జగనన్న తోడు, చేదోడు వంటి పథకాలు అమలు జరుగుతున్నాయి. కాగా రాష్ట్రప్రభుత్వం నుంచి వెలుగుగా ఈ శాఖకు పేరు మార్చుతూ ఇంతవరకు ఉత్వర్వులు వెలువడలేదు. త్వరలోనే ఈ ఉత్వర్వులు వెలువడే అవకాశం ఉందని అధికారులు బావిస్తున్నారు. విద్యాశాఖ ద్వారా అమలు జరుగుతున్న అమ్మఒడి, నాడు-నేడు వంటి పథకాలు, ఇవికాక ఆటో కార్మికులకు ఇచ్చే ఆర్థిక సహాయం పథకం, వీధి వ్యాపారులకు ఇచ్చే ఆర్థిక సహాయం అందించే పథకాల పేర్లు కూడా రూపుమారనున్నాయి.

సీజనల్ వ్యాధులపై అలర్ట్!

- వైద్యశాఖను అప్రమత్తం చేసిన ప్రభుత్వం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 6: జిల్లాలో సీజనల్ వ్యాధులపై వైద్యశాఖను ప్రభుత్వం అప్రమత్తం చేసింది రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాదులు ప్రబలుతున్నాయి. తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో వైద్యశాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే జిల్లాలోని అనేక ప్రాంతాల్లో డయేరియా, డెంగ్యూతో పాటు పలురకాల సీజనల్ వ్యాధులు వస్తుండటంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో గత నెలలో ఐదు డెంగ్యూ కేసులు నమోదు కావడంతో ఆయా ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. జిల్లాకేంద్రమైన ఒంగోలులోనే మూడు డెంగ్యూ కేసులు నమోదు కాగా చీమకుర్తి ఒకటి, అర్ధవీడు మండలంలో మరో కేసు నమోదయ్యాయి. ఆ ప్రాంతాల్లో ఆ వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. వర్షాకాలంలో దోమల వల్ల అనేకరకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకునే విధంగా ఇతర శాఖల అధికారులను అప్రమత్తం చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీచ్ రిసార్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

రిసార్ట్స్ పునఃప్రారంభానికి అనుమతి ఇవ్వాలి

రామాపురం(చీరాల), జూలై 6 : జిల్లాలోని తీర ప్రాంతంలో బీచ్ రిసార్ట్స్ కార్యకలాపాల పునఃప్రారంభానికి అనుమతి ఇవ్వాలని బీచ్ రిసార్ట్స్ అసోసియేషన్ ప్రతనిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఓ రిసార్ట్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో తీరంలో జరిగిన విషాద ఘటనలు, ఆ తరువాత నెలకొన్న పరిణామాలు, అందుకు తాము తీసుకుంటున్న జాగ్రత్తలను వివరించారు.

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, పోలీస్ అధికారులతో జరిగిన సమావేశంలో ప్రస్తావించిన విధంగా ఐదు ప్రదేశాల్లో సముద్ర స్నానాలకు ఏర్పాట్లు, వాచ్ టవర్స్, గజ ఈతగాళ్లు, లైఫ్‌జాకెట్స్ తదితరాలు సమకూర్చుకున్న విధానాలను తెలిపారు. పార్కింగ్ ఏర్పాట్లకు చేపట్టే చర్యలను వివరించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు వీరభద్రరావు, డాక్టర్ దొప్పలపూడి రవికిరణ్, డాక్టర్ అన్నె భవానీ ప్రసాద్, గోవిందరెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులకు ప్రభుత్వం కృషి చేయాలి

ఇంకొల్లు, జూలై 6 : వైసీపీ పాలనలో విద్యా విధానంలో తెచ్చిన విధివిధానాలను చంద్రబాబు ప్రభుత్వం మార్పు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పిడపర్తి పేరిరెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా నాడు - నేడు నుంచి హెచ్‌ఎంల బాధ్యతను తొలగించాలని, 3,4,5 తరగతులను విలీన జీవో-117ని రద్దు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని తొలగించాలన్నారు. గతంలో మాదిరిగా ట్రిపుల్ ఐటీ, ఎయిడెడ్ విద్యార్థులకు వెయిటేజీ మార్కులను ఇవ్వాలన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్ష పత్రం మార్పులపై వెంటనే నిర్ణయానికి వచ్చి విధివిధానాలు తెలియపరచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించే విధంగా సహకరించాని కోరారు.

వేతనాల సమస్యను పరిష్కరించాలి

పంగులూరు, జూలై 6: నాలుగు నెలలుగా నిలిచిన జీతాల సమస్యను పరిష్కరించాలని గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల సంఘ ప్రతినిధి, ఆరికట్లవారిపాలెం కార్యదర్శి ఉసురుపాటి వందనం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు పంచాయతీ కార్యదర్శుల జీత భత్యాలను ఎన్నికల కోడ్ కారణంగా ఏర్పడిన సాంకేతిక సమస్యతో నిలిచిపోయినట్లు తెలిపారు. మండలంలో గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులుగా ఆరుగురు పని చేస్తుండగా, నియోజకవర్గ పరిధిలో 26 మందికి జీతాలు అందాల్సి ఉందని తెలిపారు. నాలుగు నెలలుగా పని చేసిన కాలానికి జీతాలు అందలేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వివరించి, సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

చీరాలటౌన్, జూలై 6: శనివారం చీరాల, పర్చూరు, ఇంకొల్లు మండలాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాల్లోని షాపుల్లోని రికార్డులను అధికారులు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లు, బిల్ పుస్తకాలు తదితరాలను తనిఖీలు చేశారు.

ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, నాసిరకమైన పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలలో ఎస్సై నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ అధికారులు రవికుమార్, ఏడీఏ భాస్కరరావు, ఏవో సుమతి, తిరుమలరావు, పల్నాడు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు ఎస్పీ దంపతుల పూజలు

ఇంకొల్లు, జూలై 6 : బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ పాండురంగ విఠలేశ్వరరావు దంపతులు పావులూరు పొలిమేర వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రమేష్‌బాబు, విష్ణు అడిషనల్ ఎస్పీ దంపతులను ఆశ్వీరదించి తీర్థప్రసాదాలను అందజేసారు. సహస్ర నామాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట ఇంకొల్లు ఎస్సై మల్లికార్జునరావు, సిబ్బంది ఉన్నారు.

రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం

చీరాలటౌన్, జూలై 6 : రైలు కింద పడి గుర్తు తెలియని 50-55 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చీరాల - స్టువర్టుపురం రైల్వే స్టేషన్ మధ్య చోటు చేసుకుంది. ఈమేరకు జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు వద్ద ఎటువంటి ఆనవాళ్లు లేవని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- అదే ప్రజా కూటమి ప్రభుత్వ ధ్యేయం
- గత సర్కార్ ప్రారంభించిన ఏ పనులనూ ఆపవద్దు
- అవినీతికి పాల్పడిన అధికారులను ఉపేక్షించం
- ఆగస్టు నాటికి గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు ఏర్పాటు
- తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- మంచినీటి పథకం పనులు వేగవంతం చేయాలి
- గుండ్లకమ్మ బ్రిడ్జి, ఊటబావుల వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలి
- నామ్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయండి
- కాలువ కట్టపై మినీ బైపాస్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

అద్దంకి, జూలై 6 : సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడమే ప్రజా కూటమి ప్రభుత్వ ధ్యేయం అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో అద్దంకి పట్టణ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై మంత్రి రవికుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఏ పనునూ ఆపవద్దని, కక్ష సాధింపుతో పథకాలను ఆపడం టీడీపీ ప్రభుత్వ ఉద్దేశం కాదని, ప్రజలకు మేలు చేయడమే లక్ష్యమని మంత్రి అన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని గొట్టిపాటి హెచ్చరించారు. అద్దంకి పట్టణంలో తాగునీరు, మురుగు కాలువలను శుభ్రం చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.85కోట్లతో సమగ్ర మంచినీటి పథకాన్ని మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. ఐదేళ్లలో ఆ పనులను పూర్తి చేయడంలో వైసీపీ విఫలమైందన్నారు. రీ టెండర్‌ల పేరుతో పథకం రూపురేఖలను మార్చిందన్నారు. దీంతో టిడ్కో ఇళ్ల వద్ద కొండపై ఏర్పాటు చేయాల్సిన మంచి నీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ రద్దు అయిందన్నారు. పట్టణంలో అంతర్గత మంచి నీటి పైప్ లైన్ ఏర్పాటు సమయంలో సీసీ రోడ్లు పగులగొట్టి వదిలివేయడంతో ప్రజలు ఇబ్బంది పడి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పనులు ఆగిపోవడానికి కారణాలను అధికారులను అడుగగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మంచినీటి పథకం పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. అన్ని వార్డులలో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, అవసరమైతే గుండ్లకమ్మ నదిలో మరి కొన్ని ఊటబావులను ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. మంచినీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. స్వచ్ఛమైన నీరు అందించాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదే సమయంలో మెయిన్ సైడ్ డ్రైన్‌లలో ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు చేయించాలన్నారు. ప్లాస్టింగ్ కవర్ల వాడకంవల్ల కలిగే ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించి వినియోగం పూర్తిగా తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జి వద్ద, ఊటబావుల సమీపంలో ఇసుక తవ్వకాలు జరగకుండా మున్సిపల్, పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆగస్టు నాటికి గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు గేట్లు ఏర్పాటు చేసి నీరు నిల్వ ఉండేలా చేస్తామన్నారు. టిడ్కో ఇళ్ల గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 90శాతం మేర పూర్తయినా వైసీపీ ప్రభుత్వం ఆ తరువాత ఏ పనిచేపట్టలేదన్నారు. త్వరలో అన్ని పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడం జరుగుతుందన్నారు. త్వరలో రాష్ట్రంలో ఒకే రోజు 180 అన్న క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభిస్తున్న నేపథ్యంలో అద్దంకిలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కొత్తగా మూడు సబ్‌స్టేషన్‌లను టిడ్కో ఇళ్ల వద్ద, ఎస్ఎస్‌పి కాలనీ, గుండ్లకమ్మ బ్రిడ్జి సమీపంలో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం రూ.2కోట్లతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, కొత్త విద్యుత్‌లైన్‌లు ఏర్పాటు తదితర పనులు జరుగుతున్నాయని, నెల రోజులలో పూర్తి చేస్తామని విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు మంత్రికి వివరించారు. రైతులకు పరిహారం చెల్లించి నామ్ రోడ్డు లో గోపాలపురం, ఏల్చూరు వద్ద అసంపూర్తిగా ఆగిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అదే సమయంలో నామ్ రోడ్డు వెంబడి ఉన్న సైడ్ డ్రైన్‌లు ప్రజలకు ఉపయోగపడేలా మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకొని డిజైన్ చేసి పనులు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అసవరమైన చర్యలు చేపట్టాలన్నారు. కాలువ కట్టను మినీ బైపాస్‌గా మార్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి కార్యాలయాలకు కేటాయించాలన్నారు. ఏళ్లుగా అగ్నిమాపక కేంద్రానికి స్థలం కేటాయించలేక పోయారని వెంటనే పరిశీలించాలన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన అన్ని ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకునేలా చూడాలన్నారు. ఇసుక సమస్య లేకుండా ఉండేందుకు త్వరలో ఉచిత ఇసుకపై ప్రభుత్వం పాలసీ విడుదల చేస్తుందన్నారు. అధికారులు బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, విద్యుత్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఈఈలు నల్లూరి, జానీ, హౌసింగ్ పీడీ ప్రసాద్, టిడ్కో, నామ్ అధికారులు, కౌన్సిలర్‌లు మాగులూరి తిరుపతమ్మ, కంపా రజనీ, మొండితోక సీతమ్మ, రంగిశెట్టి సుభాషిణి, అత్తులూరి రమేష్ విజయలక్ష్మి, జహీరా, తేజశ్వని, ఏజెండ్ల నాగరాజు, వైస్ చైర్మన్ దేసు పద్మేష్, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పాదయాత్రగా వెళ్తున్న టీడీపీ యువనేత రాఘవేంద్ర తదితరులు

శింగరకొండకు పాదయాత్ర

ఆంజనేయస్వామికి మొక్కు చెల్లించుకున్న టీడీపీ యువనేత

బల్లికురవ, జూలై 6 : మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువనేత కట్టా రాఘవేంద్ర ఆధ్వరంలో శనివారం శింగరకొండ ఆంజనేయస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. టీడీపీ కూటమి అధికారం చేపట్టి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు బాధ్యతలు చేపట్టడంతో పాటు అద్దంకి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ ఐదోసారి ఘన విజయం సాధించడంతో శింగరకొండకు పాదయాత్రగా నడిచివస్తామని మొక్కుకున్నారు. ఈ మేరకు యువనేత రాఘవేంద్ర పాదయాత్రగా వెళ్లి ఆంజనేయస్వామికి మొక్కు తీర్చుకున్నారు. ఈ పాదయాత్రను టీడీపీ నియోజకవర్గ యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) ప్రారంభించారు. పార్టీకి చెందిన నేతలు, మహిళలతో పెద్ద ఎత్తున కొత్తపాలెం గ్రామం నుంచి సుమారు 20 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేసి అంజనేయస్వామికి మొక్కులు చెల్లించారు. ముందుగా బాబీ కొత్తపాలెంలో టీడీపీ పార్టీ జెండాను ఎగుర వేసి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమాలలో నేతలు మలినేని గోవిందరావు, కట్టా రామకృష్ణ, చల్లగుండ్ల రాంబాబు, ధూళిపాళ్ల పున్నారావు, ఆదిశేషయ్య, మాదాల సాంబశివరావు, బండారు శేషయ్య వీరాంజనేయులు, అజయ్, వీరాంజనేయులు, ఏల్చూరి వెంకయ్య, నరసిహారావు, కోయ దానారావు పాల్గొన్నారు.

మురుగు కాలువపై ఆక్రమణలు తొలగించాలి

సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

ఇంకొల్లు, జూలై 6 : ఇంకొల్లు ప్రధాన రహదారిలో రోడ్డు విస్తరణ సమయంలో ఆక్రమణలు తొలగించగా, తిరిగి యథావిధిగా మురుగు కాలువలను సైతం ఆక్రమించుకున్నారని ఎంపీటీసీ సభ్యుడు ఆయోషాబుడే ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆక్రమణల కారణంగా పారిశుధ్య పనులు సాగక, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. వెంటనే కాలువలపై ఆక్రమణలు తొలగించి పారిశుధ్య పనులు మెరుగుపరచాలని పట్టుబట్టారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవచూపాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డును పొందాలని, అప్పుడే నష్టం జరిగితే పరిహారం అందుతుందని తెలిపారు. ఎంఈవో అజయ్‌బాబు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఏపీవో రేణుక మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో పీఆర్ డీఈ విభూషణరావు, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో శ్రీదేవి, ఏపీఎం మోహనరావు, సీడీపీవో జ్యోతి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు రావి పేరయ్య, దుద్దుకూరు సర్పంచ్ మల్లెం శ్రీనివాసరావు, గంగవరం ఎంపీటీసీ సభ్యుడు రాజగోపాల్ పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి

అద్దంకిటౌన్, జూలై 6 : కుక్క కాటు ప్రాణాంతకమని, పెంపుడు జంతువులు ఉన్నవారు వాటి వలన ఎటువంటి వ్యాధులకు రాకుండా ముందస్తుగానే టీకాలు వేయించుకోవాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం ప్రపంచ జోనోసిస్ దినం సందర్భంగా అద్దంకి ప్రభుత్వ పశు వైద్యశాలలో రేబిస్ వ్యాధి రాకుండా కుక్కలకు ఉచిత టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యశాల ఏడీ డాక్టర్ మోహనరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా జూలై 6న జోనోసిస్ డేని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కుక్క కాటుతో రేబిస్ వస్తుందని, పెంపుడు జంతువుల నుంచి, మనుషులకు, మనుషుల వాటికి ఎలాంటి సంక్రమిత వ్యాధులు రాకుండా లూయి పార్చర్ అనే శాస్త్రవేత్త 1885లో టీకాను కనుగొన్నారన్నారు. దీనిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏటా పెంపుడు జంతువులకు టీకాలు వేయాలని సూచించారు. అనంతరం పలు కుక్కలకే డాక్టర్ మోహనరావు టీకాలు వేశారు. కార్యక్రమంలో పలువురు పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

బల్లికురవ, జూలై 6 : ఉప్పుమాగులూరు గ్రామంలో ఆదివారం చిటిపోతు, చిడిపోతు వంశస్థుల సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య తెలిపారు. విజయవాడకు చెందిన హెల్ప్ సూపర్ స్పెషాలిటీ కేర్ వైద్యశాల వైద్య బృందంతో చిటిపోతు వారి సత్రంలో వైద్య శిబిరం జరుగుతందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గుండె సంబంధిత పరీక్షలను ఉచితంగా చేసి, మందులను అందజేస్తామని తెలిపారు.

తప్పిపోయి వచ్చిన పది గేదెలు

బల్లికురవ, జూలై 6 : మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి మూడు రోజుల కిందట 10 పాడి గేదెలు తప్పి పోయి వచ్చాయి. ఇది గమనించిన గ్రామానికి చెందిన నాగండ్ల యలమందరావు అనే రైతు తన రక్షణలో ఉంచారు. గేదెలకు సంబంధించిన వ్యక్తులు ఎవరూ ఇంత వరకు రాలేదని, గేదెలు పోయిన వారు వస్తే అప్పగిస్తానని యలమందరావు తెలిపారు. మూడు రోజుల నుంచి తాను గేదెలను పొలానికి తీసుకెళ్లి ఇంటికి తెస్తున్నట్లు చెప్పారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

మార్టూరు, జూలై 6 : స్వర్గీయ ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం నోవా అగ్రి గ్రూప్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శనివారం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. లక్ష మంది పేదలకు కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నియోజకవర్గంలో చేపట్టిన బృహత్తర కార్యక్రమంలో ఇప్పటికే కొన్ని వేలమందికి కంటి ఆపరేషన్లు చేయించారు. అందులో భాగంగా ఆదివారం జరిగే కంటి వైద్య శిబిరాన్ని మార్టూరు ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పరీక్షలు అనంతరం ఆపరేషన్‌లు అవసరమైనవారికి శంకర కంటి ఆసుపత్రిలో చేయిస్తారని తెలిపారు.

ఆరు వాహనాలకు పెనాల్టీ

బల్లికురవ, జూలై 6 : సరైన పత్రాలు లేకుండా ఓవర్ లోడ్‌తో రవాణా చేస్తున్న ఆరు వాహనాలకు శనివారం బాపట్ల రవాణాశాఖాధికారి ప్రసన్నకుమారి పెనాల్టీలు విధించారు. వీర్ల కొండ నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్న గ్రానైట్ ముడి రాయి లారీలను తనిఖీ చేసిన రవాణా అధికారి రూ.1.50లక్షల పెనాల్టీలను విధించారు.

అభివృద్ధి పథంలో ముందుకు సాగుదాం

ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ కృష్ణప్రసాద్

వేటపాలెం(చీరాల), జూలై 6 : వ్యాపార వర్గాలకు అన్ని విధాలా అండగా ఉంటాం. అభివృద్ధి పథంలో ముందుకు సాగుదామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. జీడిపప్పు వ్యాపారుల అసోసియేషన్ వారి ఆహ్వానం మేరకు శనివారం వారు నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే, ఎంపీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా వెంటనే తాము స్పందిస్తామన్నారు. వ్యాపారపరంగా జీడి పరిశ్రమ పురోగమనానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు సహకరిస్తామన్నారు. వారి సమస్యలను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

ఆర్యవైశ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ చెప్పారు. స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో శనివారం ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే, ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపారపరంగా లేదా వ్యక్తిగతంగా ఏ సమస్య వచ్చినా యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శిపై విచారణకు ఆదేశం

- ఎమ్మెల్యే ఏలూరి సిఫారసుపై కలెక్టర్ స్పందన
- 12లోపు నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులకు ఉత్తర్వులు

కుంకులమర్రు(పర్చూరు), జూలై 6: కారంచేడు మండలం కుంకలమర్రు సర్పంచ్, కార్యదర్శులపై విచారణకు ఆదేశిస్తూ జిల్లా గ్రామ పంచాయతీ అధికారి దాసరి రాంబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కుంకలమర్రు గ్రామంలో మంచిటి సరఫరాలో అవినీతి జరిగిందని గ్రామస్థులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకువచ్చారు. అప్పటి టీడీపీ హయాంలో ప్రజల మంచినీటి అవసరాల కోసం ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దానిని దౌర్జన్యంగా మూసివేయించారు. తదుపరి జువ్వా చారిటబుల్ ట్రస్టు ద్వారా మంచినీటిని సరఫరా చేస్తామని చెప్పి మోసం చేశారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ఏలూరి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఏలూరి కలెక్టర్ వెంకటమురళికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ విచారించి 12లోపు నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి రాంబాబుకు ఆదేశాలు జారీ చేశారు. చీరాల డివిజనల్ పంచాయతీ అధికారిని విచారణ అధికారిగా నియమిస్తూ జిల్లా అధికారి ఉత్తర్వులు ఇచ్చారు.

సైన్స్ ల్యాబ్‌కు విరాళం

సేవా కార్యక్రమాలు ముమ్మరం చేసిన కిరణ్ రీసెర్చ్ ఫౌండేషన్

మేదరమెట్ల , జూలై 6 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రయోగశాలకు బీమని శ్రీనివాస్ రూ.36వేలు విరాళాన్ని ఇచ్చారు. శనివారం కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రయోగశాలకు విరాళం అందించారు. గ్రామానికి చెందిన ప్రస్తుతం అరుణాచలంలో నివాసం ఉంటున్న బీమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోరిక మేరకు పాఠశాలలోని సైన్స్ ల్యాబ్ అభివృద్ధికి విరాళాన్ని అందజేశారు. గ్రామంలో విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని శ్రీనివాస్ తన సందేశాన్ని పంపారు.

కిరణ్ జ్యోతి రూరల్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ముమ్మరం చేశారు. రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందెపు రాజశేఖర్ ఇచ్చిన పిలుపు మేరకు సేవా కార్యక్రమాలను చేపట్టడానికి పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. రాజశేఖర్ స్వయంగా గ్రామంలోని ప్రాథమిక పాఠ శాలలో రక్షిత మంచినీరు తాగడానికి వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అండగా ఉండడంతో పాటు ఆయా సబ్జెక్టులలో నిపుణులైనవారిని తీసుకువచ్చి విద్యార్థులకు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. రాజశేఖర్ గ్రామంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు గ్రామానికి చెంది ఉన్నత స్థానాలల్లో ఉన్న పలువురు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ముందుకు వస్తున్నారు. గ్రామస్థులు సహకారంతో భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని రాజశేఖర్ తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం

చినగంజాం, జూలై 6 : వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బినాగేంద్ర అన్నారు. మండలంలోని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది డయేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలుషిత ఆహారం, నీరు వల్ల అతిసార వస్తుందని తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ ట్యాబెట్లు ద్వారా వ్యాధిని అరికట్టవచ్చునని డాక్టర్ సూచించారు. కాచి చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు కనబడితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలియపరిచి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్ ఈవో యు.వెంకటరమణ, హెచ్ఈ మాధవి, ఫార్మసిస్ట్ శ్రీలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ సుధా, హెల్త్ అసిస్టెంట్ జి.విజయప్రసన్న, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

నూతలపాడు(పర్చూరు), జూలై 6 : సీజనల్ వ్యాధుల దృష్ట్యా పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.హరిప్రసాద్ నేతృత్వంలో శనివారం మురుగు కాలువలను శుభ్రం చేయించడంతోపాటు, మురుగు నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టారు. దోమలు ప్రబలకుండా కాలువల్లో ఆయిల్ బాల్స్‌ను పిచికారీ చేయడంతోపాటు ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈసంద్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.


బాబూజగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్నర్పి ప్రతినిధులు

అద్దంకి, జూలై 6 : మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూజగజ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని కట్టకిందపాలెంలో ఆయన విగ్రహానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్ చిత్రపటానికి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, దళిత సంఘాల నేతలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఎస్సీ సెల్ నేతలు ఎంజే స్టాలిన్, దేవసహాయం, పూనూరి నరేంద్ర పాల్గొన్నారు. అనంతరం మంత్రి కట్టకిందపాలెంలో ఇటీవల మృతి చెందిన గాలి లక్ష్మీనారాయణ, గాలి నాగేంద్రమ్మ కుటుంబాల సభ్యులను రవికుమార్ పరామర్శించారు. పట్టణంలోని కాకానిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న పాపారావును మంత్రి రవికుమార్‌ను పరామర్శించారు.

చీరాలటౌన్ : మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అప్పుడే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ప్రతినిధులు అన్నారు. శనివారం పట్టణంలో బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ముక్కోణం పార్క్ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ సేవలను గుర్తు చేస్తూ కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, వందనం, రమేష్, మత్తయ్య, జగదీష్, అప్పారావు, చిరంజీవి, రమేష్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : టీడీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాలేరు రామకృష్ణ, కరి శ్రీనివాసరావు, వలేరు మార్కు, బోడావుల శివయ్య, బీసీ నాయకులు వడ్లమూడి సాంబయ్య, ఎస్సీ నాయకులు బొతుల రాజేష్, మీరావలి పాల్గొన్నారు.



'నెల్లూరు నగర కార్పొరేషన్(ఎన్ఎంసీ) కమిషనర్ నేను చెప్పినట్టే వింటాడు... నీ సస్పెన్షన్ ఎత్తేయించే బాధ్యత నాది....! రూ. లక్ష ఇవ్వు.. అంతా నేను చేసుకుంటా... మీపై త్వరలో ఎఫ్ఐఆర్ నమోదు కాబోతోంది. ఫైల్ రెడీ చేశారు. నా సంగతేంటో చూసుకోండి'... అంటూ కార్పొరేషన్‌లోని ఓ సీనియర్ సహాయకుడు వసూల్‌రాజా అవతార మెత్తారు. తాజాగా వెలుగు చూసిన కమిషనర్ సంతకాల ఫోర్జరీ స్కాంను అడ్డంపెట్టుకుని అందినకాడికి దండుకుంటున్నాడు. ఇలా ఇటీవల సస్పెన్షన్ గురైన ఇద్దరు చిరుద్యోగుల వద్ద రూ. లక్ష చొప్పున వసూలు చేశారు. కాగా స్కాంలో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న లైసెన్స్ ఇంజనీర్ల వద్ద నుంచి కూడా నగదు వసూలు చేసినట్లు సమాచారం.

- నెల్లూరు(సిటీ)

రూ.లక్ష ఇస్తే

సస్పెన్షన్ ఎత్తేయిస్తా..!

- కార్పొరేషన్ ఫోర్జరీ స్కాంలో కొత్తకోణం
- ఎన్ఎంసీలో సీనియర్ సహాయకుడి బాగోతం
- చెప్పినట్టు కమిషనర్ వింటాడని అందినకాడికి వసూళ్లు





రాష్ట్రంలో పురపాలక శాఖను విస్మయానికి గురిచేసిన నెల్లూరులోని సంతకాల ఫోర్జరీ కుంభకోణం కార్పొరేషన్‌లోని ఓ సీనియర్ సహాయకుడికి ఆర్థిక వనరుగా మారింది. ఈ స్కాంలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిటీ ప్లానింగ్ అధికారులు ఇద్దరు, సచివాలయ ఉద్యోగులు మరో ఇద్దరిని కమిషనర్ వికాస్‌మర్మత్ ఇటీవల సస్పెండ్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన సీనియర్ సహాయకుడు మీ సస్పెన్షన్ నేను ఎత్తేపిస్తా... నాకు రూ. లక్ష చొప్పున ఇవ్వడంటూ వసూళ్లు చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇదే సమయంలో స్కాంకు సంబంధం ఉన్నట్లు లైసెన్సు ఇంజనీర్లను వివరణ కోరుతూ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. వారితోనూ టచ్‌లోకి వెళ్లిన ప్రబుద్ధుడు తనకు సొమ్ము ముట్టుచెబితే కార్పొరేషన్‌లో తాజాగా సిద్ధమవుతున్న ఎఫ్ఐఆర్‌లో మీ పేర్లు లేకుండా చేస్తానంటూ వారిని నమ్మబలుకుతున్నాడు.

● ఇంక్రిమెంట్ల పునరుద్ధరణకు రూ. 70వేలు

గతంలో అలీంబాషా కమిషనర్‌గా ఉన్న సమయంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన ఓ మహిలా ఉద్యోగిని సస్పెండ్ చేశారు. దీంతో ఆమెకు అందాల్సిన ఇంక్రిమెట్లు నిలిచిపోయాయి. వాటిని పునరుద్ధరణ చేయిస్తానని ఆమె నుంచి రూ. 70 వేలు వసూలు చేసినట్లు తాజాగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దాదాపుగా ఐదేళ్ల పాటు ఆమెను తనచుట్టూ తిప్పించుకుంటున్నట్లు సమాచారం. కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఓ వ్యక్తికి డివిజన్లలో ఫిట్టర్ పోస్టు ఇప్పిస్తానని రూ. 50 వేలు వసూలు చేసినట్లు తెలిసింది.

● గత అనుభవం దృష్ట్యా...

కార్పొరేషన్‌లోని ఎస్టాబ్లిష్‌మెంట్‌లో పనిచేసే ఈ ఉద్యోగి కొన్నేళ్ల క్రితం కమిషనర్ పేషీలో సీసీగా పనిచేశాడు. దీంతో కమిషనర్‌తో అతనికి మంచి సంబంధాలున్నట్లుగా అందరూ నమ్ముతారు. అదే అతని పెట్టుబడిగా దందా కొనసాగిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇతడిపై విచారణ చేపడితే మరిన్ని విషయాలు వెలుగులోకి రానున్నాయని ఉద్యోగులు అంటున్నారు.

ఎన్ఎంసీని కుదిపేస్తున్న ఫోర్జరీ సంతకాల కుంభకోణం పై కేసు నమోదు చేసి, దోషులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌ను కోరారు. శుక్రవారం ఆయన లేఖ రాయగా, శనివారం వెలుగులోకి వచ్చింది. ఫోర్జరీ సంతకాల వ్యవహారంలో తన వద్దనున్న సమాచారాన్ని ఐదు పేజీల లేఖలో సవివరంగా ప్రస్తావించిన కమిషనర్, ఇప్పటి వరకు తన పరిధిలో తీసుకున్న శాఖపరమైన చర్యలను అందులో వివరించారు. ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చేందుకు విజిలెన్స్ విచారణను కూడా కోరినట్లు తెలిసింది.

ఫోర్జరీ సంతకాలపై కేసు

- ఎస్పీని కోరిన నగర కమిషనర్

● మేయర్ భర్త ప్రమేయం !

ఈ కుంభకోణంలో మేయర్ పొట్లూరి స్రవంతి భర్త జయవర్ధన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సిటీ ప్లానింగ్ విభాగంలో టీపీవోలుగా ఉన్న బీ ప్రవీణ్, ఎం దేవేంద్రతోపాటు సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీలుగా ఉన్న పీ నాగేంద్రబాబు, కే కార్తీక్‌మాలవ్యను ఇప్పటికే సస్పెండ్ చేశారు. వీరితో స్కాం చేయించడంలో మేయర్ భర్త జయవర్ధన్, అతడి సహాయకుడు శివకృష్ణ పాత్ర కీలకమంటూ న్యాయవాది కాకు మురళీ నుంచి తనకు ఫిర్యాదు అందిందని కమిషనర్ ఆ లేఖలో పేర్కొన్నాడు.

● వైసీపీ వర్గాల్లో వణుకు

రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొలువు తీరిన వెంటనే ఈ కుంభకోణం బహిర్గతం కావడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు రేపుతోంది. ఈ స్కాంలో ఇప్పటికే మేయర్ భర్త జయవర్ధన్ ఆరోపణలు ఎదుర్కొంటుండగా, ఆయనతో పాటు మరో నలుగురు కార్పొరేటర్ల ప్రమేయం ఉన్నట్లు చర్చ నడుస్తోంది. సహకార సంస్థకు చెందిన చైర్మన్ పేరు కూడాఆ ఈ స్కాంలో ప్రధానంగా వినిపిస్తోంది. అటు విజిలెన్స్, ఇటు పోలీసులు దర్యాప్తు చేయాలని అధికారికంగా లేఖలు అందడంతో వైసీపీ వర్గాల్లో వణుకు ప్రారంభమైంది.

లేఅవుట్లలో అక్రమాలపై చర్యలు

- నుడా వీసీ బాపిరెడ్డి
- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటైన లేఅవుట్లలో అక్రమాలపై చర్యలు తీసుకుంటామని నుడా వీసీ బాపిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఆయన స్పందిస్తూ పొదలకూరులో ఫోర్జరీ డాక్యు మెంట్లతో లేఅవుట్లు వేసినట్లు తమ దృష్టికి రావడంతో సిబ్బం దితో వెళ్లి తనిఖీ చేసి నిర్ధారించు కున్న తరువాతే పోలీసు కేసు నమోదు చేశామన్నారు. తమ దృష్టికి ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న లేఅవుట్లపై తనిఖీలకు ప్రభుత్వం ప్రత్యేక త్రీమన్ కమిటీ ఏర్పాటు చేసిందని ఆయన వివరించారు.

● నకిలీ పత్రాల సృష్టికర్తలపై కేసు నమోదు

పొదలకూరు : పట్టణంలోని నెల్లూరు ప్రధాన రోడ్డు పక్కన నకిలీపత్రాలు సృష్టించి లేఅవుట్ వేసిన యజమానులపై నుడా వైస్‌చైర్మన్ బాపిరెడ్డి ఇచ్చిన పీ ర్యాదు మేరకు ఎస్ఐ డీ రామకృష్ణారెడ్డి శనివారం కేసు నమోదు చేశారు. క్రైం నెంబరు 74/24 అండర్ సెక్షన్ 468, 471, ఆర్/డబ్ల్యూ 34ఐపీసీ సెక్షన్ల కింద లేఅవుట్ యజమానులైన రాపాటి వెంకటరత్నం, మొలబంటి రాజారావు, మొలబంటి శ్రీనివాసరావు, మొలబంటి రాఘవరావులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అటవీశాఖలో పదోన్నతి బదిలీలు

- 8 మంది ఎఫ్ఎస్‌వోలకు డీఆర్‌వోలుగా ఉద్యోగోన్నతి
- ఉత్తర్వులిచ్చిన గుంటూరు రేంజ్ సీసీఎఫ్

నెల్లూరు (వెంకటేశ్వరపురం)జూలై 6: గుంటూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో ఎనిమిదిమంది ఫారెస్ట్ సెక్షన్ అధికారు(ఎఫ్ఎస్‌వో)లకు డిప్యూటీ రేంజ్ అధికారి(డీఆర్‌వో)లుగా పదోన్నతులు కల్పిస్తూ బదిలీలు చేస్తున్నట్లు రేంజ్ సీసీఎఫ్ వై.శ్రీనివాసులురెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో నెల్లూరు జిల్లా నుంచి ముగ్గురు పదోన్నతి పొందారు. షేక్ నాయబ్‌రసూల్ నెల్లూరు రేంజ్ నుంచి పదోన్నతిపై శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ పరిధిలోని మార్కాపురానికి బదిలీ అయ్యారు. ప్రకాష్‌రావును సూళ్లురుపేట వైడ్‌లైఫ్ నుంచి పిడుగురాళ్ల రేంజ్‌లోని మార్కాపురానికి స్థానచలనం కల్పించారు. షేక్ మునీర్‌బాబును ఉదయగిరి రేంజ్‌లోని కృష్ణంపల్లి సెక్షన్ నుంచి మార్కాపురం టైగర్ ప్రాజెక్ట్‌కు బదిలీ చేశారు. త్వరలోనే కింది స్థాయి అన్నీ కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులతోపాటు బదిలీలు కూడా నిర్వహించనున్నట్లు అటవీశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

జనం సొమ్ము రాళ్ల పాలు !

● వృథాగా జగనన్న భూరక్ష రాళ్లు

గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును ఎలా దుర్వినియోగం చేసిందనడానికి ఈ రాళ్ల గుట్టలే నిదర్శనం. గత ప్రభుత్వంలో వైఎస్ఆర్ జగనన్న భూ సంరక్ష పథకం కింద భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టారు. రీసర్వే చేసి హద్దులు తెలిపేందుకు రాళ్లను నాటాలని నిర్ణయించారు. ఈ రాళ్లపై వైఎస్ఆర్ జగనన్న భూరక్ష అని కూడా చెక్కించారు. అప్పట్లో రీసర్వేపై రైతుల నుంచి పలు అభ్యంతరాలు వచ్చాయి. అయినా కొన్ని పొలాల్లో నామమా త్రంగా రాళ్లను నాటారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. రీసర్వే నిలిచిపోయింది. అయితే ఆ రాళ్ల మాత్రం ఉదయగిరి మండలం యర్రబల్లిగడ్డ గుట్టలుగా పడి ఉన్నాయి. ఈ రాళ్లను చూసి పలువురు వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును ఎలా దుర్వినియోగం చేసిందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఉదయగిరి రూరల్



యర్రబల్లిగడ్డ సెంటర్ వద్ద గుట్టలుగా పడి ఉన్న జగనన్న భూరక్ష రాళ్లు



ఎమ్మెల్యేలతో సమీక్షిస్తున్న మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ

అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళదాం...

- ఎమ్మెల్యేల సమావేశంలో మంత్రుల నిర్ణయం
- ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధిపై సమీక్ష
- ఆనం, నారాయణ దృష్టికి నియోజకవర్గాల సమస్యలు
- సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి.. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని అమాత్యుల హామీ

నెల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి చేయాలని జిల్లా టీడీపీ నేతలు నిర్ణయించుకున్నారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిల నేతృత్వంలో శనివారం జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు సమావేశమ య్యారు. మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధి, అందుకు చేయాల్సిన కృషి అనే అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షలో కలెక్టర్ ఆనంద్, జేసి సేథు మాధవన్ కూడా పాల్గొన్నారు. సమావేశంలో నియోజకవర్గాల వారీగా నెలకొన్న సమస్యలు, ప్రజల అవసరాలను ఎమ్మెల్యేలు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కలెక్టర్‌కు మంత్రులు వివరించి, సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సమన్వయంతో మంచి వాతావరణంలో జిల్లాను అభివృద్ధి చేయాలని తీర్మానించారు. ఈ సమావేశ వివరాలను మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ మీడియాకు వివరించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన అర్థవంతమైన చర్చ జరిగిందన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్ర పాలన ప్రారంభమైందని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని వారు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకా శాలు, ఇదివరకే ఉన్న పరిశ్రమల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై ఎమ్మెల్యేలు కలెక్టర్, జేసీల దృష్టికి తీసుకొచ్చా రని వివరించారు. త్వరలో జిల్లాకు జలవనరుల శాఖ మంత్రిని ఆహ్వానించి సాగునీటి ప్రాజెక్టులు త్వరిత గతిన పూర్తి చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల జీవనాడి అయిన సోమశిల ప్రాజెక్టును గత ఐదేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అప్రాన్ కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు మనుగడే ప్రశ్నార్థకం అయిందన్నారు. త్వరలోనే జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. మంత్రి పొంగూరు నారాయణ నాయకత్వంలో జిల్లా పరిధిలోని ఎంపీలు,ఎమ్మెల్యేలంతా సమన్వయంతో సమష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధిని గాడిన పెట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. దగదర్తి ఎయిర్‌పోర్టు, దుగరాజపట్నం పోర్టు, కిసాన్ సెజ్, కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌లతోపాటు కొత్త పరిశ్ర మల స్థాపనపై దృష్టి సారించామని వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నెలవల విజయశ్రీ, పాశం సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు(ఫైల్)

బైక్ కనిపిస్తే... క్షణాల్లో మాయం !

- తాళాలు మార్చి.. చిన్నచిన్న చిట్కాలతో దోచేస్తారు..
- పార్కింగ్ సమస్యే దొంగల చేతివాటానికి ఊతం
- అపహరించేవారు సరే.. విక్రయించేవారి మాటేంటి ?
- జిల్లా వ్యాప్తంగా వరుస చోరీలు
- నెల వ్యవధిలో 120 బైక్‌ల స్వాధీనం

నెల్లూరు(క్రైం), జూలై 6: సొంత మోటారు బైక్ కలిగి ఉండడం, దాన్ని వేగంగా తోలడం ప్రతి యువకుడు కల... స్థాయిని బట్టి డౌన్‌పేమెంట్ కట్టి, లేదా అప్పు చేసి నేటి యువకులు ఎంతో ఇష్టంగా బైక్‌లను కొనుగోలు చేస్తుంటారు... కొనుగోలు చేసిన బైక్‌ను ప్రాణంలా చూసుకుంటారు. ఇక మధ్యతరగతి కుటుంబాలకు బైక్ నిత్యావసరం. కుటుంబ అవసరాలకు బైక్ తప్పనిసరిగా ఉండాల్సిందే. అందుకే బైక్‌ను రిపేరుకు ఇస్తే ఇంటిల్లపాది సెలవు పెట్టి కూర్చుంటారు. మనిషి జీవన శైలిలో బైక్‌కు అంత ప్రాధాన్యత ఉంది.

అయితే ప్రస్తుతం జల్సాలకు అలవాటు పడిన వారికి, ఈజీగా దొంగతనాలు చేసేవారికి ఈ బైక్‌లు వరంలా మారాయి. మారుతాళాలు, అరిగిన తాళాలు వినియోగించడం, చిన్న చిన్న చిట్కాలతో ఎంతో సులభంగా బైక్‌ల తాళాలు తీసేసి దోచేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా వరుసగా జరుగుతున్న బైక్ దొంగతనాలపై నెల రోజులుగా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో వందల సంఖ్యల్లో బైక్‌లను వారు స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు.

● పార్కింగ్ సమస్యతోనే..

జిల్లావ్యాప్తంగా షాపింగ్‌మాల్స్ ప్రధాన కూడళ్లు, బార్లు, కేఫ్‌లు, హోటళ్లు, వైద్యశాలల వద్ద పార్కింగ్ ప్రాంతాలు లేకపోవడంతో బైక్‌ల యజమానులు కొద్ది సేపటిలో నే వచ్చేస్తాంలే.. ఇక్కడ పెడితే ఏం కాదులే.. అన్న ధోరణిలో రోడ్ల పక్కనే బైక్‌లను నిలిపి వెళుతున్నారు. ఇదే అదునుగా దొంగలు చేతివాటం ప్రదర్శించి వాటిని దోచుకువెళుతున్నారు. ముఖ్యంగా నెల్లూరు నగరంలో బైక్‌ల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. సీసీ ఫుటేజీల ద్వారా బైక్ దొంగలను గుర్తించినా, పాత నేరస్థులు కావడంతో వారిని పట్టుకోవడం పోలీసులకు సవాల్ మారింది.

● విక్రయించే వారి సంగతేంటి ?

బైక్‌లను దోచేస్తున్న వారిని పోలీసులు వెనుకో ముందో అరెస్ట్ చేస్తున్నారు. అయితే దొంగల వద్ద బైక్‌లు కొని విక్రయిస్తున్న వారిపై మాత్రం పోలీసులు దృష్టి సారించడం లేదు. దీంతో తక్కువ ధరకు, కాగితాలు లేని బైక్‌లను సామాన్యులకు విక్రయిస్తూ కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. అయితే తక్కువ ధరకు బైక్‌ను కొనుగోలు చేస్తున్న సామాన్యులు మాత్రం, ఆ బైక్ చోరీ జరిగిన సమయంలో బైక్ పోయిందని ఫిర్యాదు ఇచ్చేందుకు అవకాశం ఉండటం లేదు. దీంతో బైక్ దొంగలు దోచేసిన బైక్‌లను మళ్లీ మళ్లీ దోచేస్తూ జల్సాలు చేస్తున్నారు. ప్రధానంగా పేకాట, క్రికెట్ బెట్టింగ్, సింగిల్ నెంబర్లాట, లోపలా,బయటా లాంటి జూదాలకు అలవాటు పడిన యువతే పదేపదే బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. జిల్లా వ్యాప్తంగా నెలరోజుల వ్యవధిలో పోలీసులు 120కు పైగా బైక్‌లను స్వాధీనం చేసుకొని, నిందితులను అరెస్ట్ చేశారు. దీన్ని బట్టి చూస్తే జిల్లాలో ఏ స్థాయిలో బైక్‌ల దొంగతనాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రజలు జాగ్రత్త పడాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కొడిగుడ్డను కిందకి దింపుతున్న పూజారి



ముగిసిన రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

- వైభవంగా ధ్వజావరోహణ
- తగ్గిన హుండీ ఆదాయం

విడవలూరు, జూలై 6 : మండలంలోని రామతీర్థంలో జరుగుతున్న రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజావరోహణతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ పూజారులు పేరేపి శ్రీకాంత్ శర్మ,శ్రీనివాస శర్మ ధ్వజస్తంభానికి కట్టిన కొడిగుడ్డకు పూజలు నిర్వహించి, కొడిగుడ్డను కిందకు దింపారు. అనంతరం సంతానం లేని మహిళలకు కొడిముద్దలను పంపిణీ చేశారు. సాయంత్రం రామతీర్థం గ్రామానికి చెందిన నాశిన వెంకటశేషయ్య, వెంకట శేషమ్మ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి పూలంగిసేవ నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు ఏకాంతసేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా స్వర్గీయ కొమారి చినవెంకయ్య కుటుంబ సభ్యులు, కొనగళ్ల వెంకటశెట్టి వ్యవహరించారు.

గణనీయంగా తగ్గిన హుండీ ఆదాయం

స్వామివారి హుండీ ఆదాయం గత ఏడాది కన్నా ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. 2023లో రూ.2.97 లక్షలు రాగా, ఈ ఏడాది రూ.1.98 లక్షలు మాత్రమే వచ్చింది. ఆలయ ఆవరణలో ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఉదయం హుండీ లెక్కింపు జరిగింది.



హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఇసుక ధరలను నిర్ణయిస్తాం: కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), జూలై 6 : జిల్లాలోని ఇసుక రీచ్‌లలో ఇసుక పరిమాణం, రవాణా చార్జీల ధరను నిర్ణయిస్తామని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రీచ్‌లలో ఇసుక లభ్యతపై మైనింగ్ అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశానికి ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లాలో ఇసుక ధరలను నిర్ణయించాలని కలెక్టర్లకు సూచించారు. రీచ్‌లలో ఇసుక లభ్యత, పరిమాణం, ధరల వివరాలను వెంటనే నిర్ణయించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఇసుక కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ధరల విషయాన్ని ప్రకటిస్తామన్నారు.

గదులు చాలక..టీచర్లు లేక ఇక్కట్లు

- 10గదులు.. 529 మంది విద్యార్థులు
- వాటిలో శిథిలావస్థ గదులే దిక్కు
- 12మందే ఉపాధ్యాయులు
- అవస్థలు పడుతున్న ఉదయగిరి ఉన్నత పాఠశాల విద్యార్థులు


శిథిలావస్థకు చేరిన తరగతి గదులు


ఇరుకు గదుల్లో విద్యార్థుల అవస్థలు

ఉదయగిరి రూరల్, జూలై 6: స్థానిక ఉన్నత పాఠశాలలో నూతన తరగతులను నిర్మించక పోవడంతో విద్యార్థులు,ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 529 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు పది తరగతి గదులు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా గదులు లేకపోవడంతో ఒకే గదిలో రెండు, మూడు తరగతులను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్న గదులు దశాబ్దాల క్రితం నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసేదిలేక ఉపాధ్యాయులు కొన్ని తరతులను చెట్ల కింద నిర్వహిస్తున్నారు. దీనికితోడు పాఠశాలలో 26మంది ఉపాధ్యాయులు ఉండాల్సి కేవలం 12మంది మాత్రమే ఉన్నారు. ప్రధాన సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేక పోవడంతో మిగిలిన ఉపాధ్యాయులు అదనపు తరగతులు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వసతులు లేకపోయినా ప్రతి ఏడాది పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు.

నాడు-నేడు పనుల్లో అవస్థలే:
మన బడి నాడు-నేడు పథకం కింద రెండో విడత మరమ్మతులు, అదనపు తర గతి గదుల నిర్మాణాలకు గత ప్రభుత్వం రూ.1.50కోట్లను మంజూరు చేసింది. వాటిలో రూ.65లక్షలు మాత్రమే విడుదల చేయడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంతమేర పనులు చేపట్టి వదిలేశారు. అప్పటినుంచి నిధులు మంజూరు కాకపోవడంతో అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు శిథిలావస్థకు చేరిన తరగతి గదుల్లోనే కాలం వెల్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తి చేసి ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్డీ నగదు స్వాహాపై విచారణ


ఖాతాదారులతో చర్చిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

ఉదయగిరి రూరల్, జూలై 6: పుల్లాయపల్లి బ్రాంచ్ పోస్టుమాస్టర్ షేక్ నాయబ్‌రసూల్ ఖాతాదారుల ఆర్డీ నగదు స్వాహా ఘటనపై శనివారం ఎంపీడీవో ఈశ్వరమ్మ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె పోస్టాఫీసును తనిఖీ చేయడంతో పాటు ఖాతాదారులను విచారించి పాసుపుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఖాతాదారుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వైఎస్‌ఆర్ జయంతిని జయప్రదం చేయండి

ఉదయగిరి, జూలై 6: మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని జయప్రదం చేయాలని ఉదయగిరి-1 ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు.

సకాలంలో పాఠ్యపుస్తకాల పంపిణీ

ఉదయగిరి, జూలై 6: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రెండోవిడత పాఠ్యపుస్తకాలు అందజేయనున్నట్లు శనివారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పుస్తకాల పంపిణీ స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న విద్యార్థుల అడ్మిషన్ల ప్రకారం 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేసేందుకు నివేదికలు తయారు చేయాలన్నారు. త్వరలో బూట్లు, యూనిఫాం, బ్యాగ్‌లు అందజేస్తామన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 6: చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని దుత్తలూరు పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్ సూచించారు. శనివారం వెంకటంపేటలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఎంఎల్ హెచ్‌పీ కిరణ్మయి, సిబ్బంది శ్రీహరి, ప్రశాంతి, ప్రభావతి పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో సమానత్వం


ర్యాలీలో పాల్గొన్న ఏపీఎం వెంకమ్మ, వీవోవోబీ, సీసీ, వీవోఏలు

ఆత్మకూరు, జూలై 6: మహిళా సాధికారతతో సమానత్వం సాధించాలనే లక్ష్యంతో పేదరిక నిర్మూలన దిశగా పొదుపు మహిళలందరికీ ఆర్థిక స్వావలంబన చేకూర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అందుబాటులోకి తెస్తోందని ఏపీఎం వెంకమ్మ తెలిపారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని మండల సమైక్య కార్యాలయంలో వీవోవోబి, సీసీ, వీవోఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ ఎండి మున్వర్, ఫీల్డ్ ఆఫీసర్ షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిల క్యాంపు కాలనీలో అంధకారం

అనంతసాగరం, జూలై 6: సోమశిల క్యాంపు కాలనీలో వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంది. సమస్యను డ్యాం అధికారులకు విన్నవించినా ఫలితం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. విషసర్పాలు ఎక్కువగా వున్నాయని, అధికారులు దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే..!

అనంతసాగరం, జూలై 6: మండల కేంద్రంలో పలు వీధులు అధ్వానంగా ఉన్నాయి. మురుగు కాలువలు లేక వర్షపు నీరు బయటకు వెళ్లే వెసులుబాటు లేదు. దీంతో చిన్నపాటి వర్షం పడినా రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. స్థానిక బీసీ కాలనీలో రోడ్డుపై బురదతో స్థానికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని బీసీ కాలనీ వాసులు కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న బీసీ కాలనీ రహదారి

కుక్కలకు ఉచితంగా రేబిస్ నివారణ వ్యాక్సిన్


పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

సంగం, జూలై 6: మండలంలోని మర్రిపాడు పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పశువైద్యురాలు డాక్టర్ డి.సుజని ఆధ్వర్యంలో శనివారం కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెంపుడు కుక్కల యజమానులు అవకాశాన్ని వినియోగం చేసుకోవాలని కోరారు.

చేజర్ల: ప్రపంచ జోనోసిస్ డే సందర్భంగా శనివారం మండల కేంద్రమైన చేజర్లలోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డా. పి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిత్తలూరు పీహెచ్‌సి కేంద్రంలో నవీన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

వరికుంటపాడు: పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి ఎస్‌వీ రాఘవేంద్ర మాట్లాడుతూ జూనోటిక్, రేబిస్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని పశువైద్యశాలలు, రైతుసేవా కేంద్రాల పరిధిలోని కుక్కలకు ఉచితంగా టీకాలు వేయించామన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు మనిదీప్, డీ మణిచందన, వైష్ణవీలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల సంరక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్‌కుమార్

ఆత్మకూరు, జూలై 6 : బాలికల సంరక్షణే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు ప్రత్యేకశ్రద్ధ వహించాలని జిల్లా బాలల సం రక్షణ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ చూపాన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఆశావర్కర్లు గుర్తించి వెంటనే అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం బాలికలు తీసుకోవాల్సి జాగ్రత్తలపై ముద్రించిన హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీడీపీవో సునీలత, డాక్టర్ అస్మా, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు విజయలక్ష్మీ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజవోలు సహకార సంఘం అభివృద్ధికి కృషి

ఏఎస్ పేట, జూలై 6: స్థానిక రాజవోలు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో జెండా ఆవిష్కరించారు అనంతరం సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ బి సత్యనారాయణ, ఏఎస్ పేట ఎన్‌డిసిసి బ్యాంక్ మేనేజరు సిహెచ్ వి సుబ్బారెడ్డి, అసిస్టెంట్ మేనేజరు హరీష్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ


రైతు కుంటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

అనంతసాగరం, జూలై 6: మండలంలోని చిలకలమర్రి గ్రామానికి చెందిన కౌలురైతు డబ్బుకొట్టు శీనయ్య ఇటీవల పాము కాటుతో మృతిచెందగా శనివారం సీపీఎం రాష్ట్ర కౌలు రైతు సంఘం సభ్యులు గంట లక్ష్మీపతి, మండల కార్యదర్శి అన్వర్‌బాష అత ని కుటుంబాన్ని పరామర్శించారు. కౌలు రైతుచట్టం ద్వారా రూ.10లక్షలు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్

ఆత్మకూరు, జూలై 6: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఆత్మకూరు ఉప విద్యాశాఖాధికారి కె.గోపాల్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని కరటంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి వసతులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా ఉన్నాయని, మెరుగైన విద్యను అందించాలని సూచించారు.

క్రీడలకు దూరమైన విద్యార్థులు

- ఆటస్థలం లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



సీతారామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

సీతారామపురం, జూలై 6: మండలకేంద్రంతో పాటు ఓగూరువారిపల్లి జడ్పీహెచ్‌ఎస్ స్కూల్, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో 6 వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన నిర్వహిస్తున్నారు. దాదాపు 1160 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కానీ ఈ పాఠశాలలకు క్రీడా మైదానం లేదు. క్రీడలను ఆడించేందుకు ఫిజికల్ డైరెక్టర్ ఉన్నా వాలీబాల్, కబడ్డీ, హాకీ తదితర క్రీడలను ఆడించలేని దుస్థితి నెలకొంది. పాఠశాల ఆవరణలో విరామ సమయంలో ఆడుకోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ఆట స్థలాన్ని కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్రీడామైదానం ఏర్పాటు చేయాలి



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, కస్తూర్బా, మోడల్ స్కూ ల్ పాఠశాలలో ఆట స్థలం లేదు. విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి ఉన్నా దూరంగా ఉండాల్సిన పరిస్థితి. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా మైదానాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైంది.

- శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు

సౌకర్యాలు కల్పించాలి

మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ స్కూల్‌లో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి. అలాగే మెయిన్ రోడ్డు నుంచి కేజీబీవీ పాఠశాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. తారు రోడ్డు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఉండవు.

- షేక్ షాజిదా, కస్తూర్బాగాంధీ స్కూల్ హెచ్‌ఎం

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించండి

లింగసముద్రం, జూలై 6: సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలు పరిష్కారానికి సత్వరం పరిష్కరించాలని ఎంపీడీఓ కె శ్రీని వాసులు తెలిపారు. శనివారం లింగసముద్రంలోని ఎంపీడీఓ కార్యాల యంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్య దర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అర్జీలను పెండింగ్‌లో ఉంచవద్దన్నారు.

ప్రసన్నుడికి పూజలు


శ్రీదేవీ, భూదేవిలతో ఊంజల్ సేవలో శ్రీనివాసుడు

బిట్రగుంట, జూలై 6: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు శనివారం ప్ర త్యేక పూజలు జరిగాయి. అల్లూరు మండలం పురిణి గ్రామానికి చెందిన గండవరం మురళీకృష్ణ కుటుంబ సభ్యులు ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం శ్రీనివాసునికి ఊంజల సేవ జరిగింది.

రూ.10 కోట్లతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

- ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

వరవ కాలువ పూడికతీత పనుల ప్రారంభం


పూడికతీత పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జూలై 6: పట్టణంలో త్వరలో రూ.10 కోట్లతో రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేపట్టనున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరులో మంత్రులు పొంగూరి నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతో జిల్లా ఎమ్మెల్యేలు సమావేశం కాగా, కావలిలో రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి రూ. 10 కోట్లతో ప్రతిపాదనలు పంపమని మంత్రులు చెప్పారన్నారు. కావలి పట్టణ మానస థియేటర్ సెంటర్‌లో వరవకాలువ పూడికతీత పనులను కావలి ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్‌తో కలిసి శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలిలో ప్రజల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. అవినీతి రహిత పాలన అందిస్తానని, తన నివాసం వద్ద ఒక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యల సత్వర పరిష్కార దిశగా చర్యలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సాయిరాం, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, గుత్తికొండ క్రిషోర్, మలిశెట్టి విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన ఇంటూరి


జేసీని సత్కరిస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

నెల్లూరు(హరనాథపురం), జూలై 6: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు.

ఇస్కపల్లి పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా : బీద


అధికారులతో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

అల్లూరు, జూలై 6: మండలంలోని ఇస్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవి చంద్ర అన్నారు. పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వగ్రామమైన ఈ పాఠశాలలో మత్స్యకార విద్యార్థులు అత్యధికంగా విద్యను అభ్యసిస్తున్నారని అటువంటి పాఠశాలను మండలంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో బీద గిరిధర్, సర్వశిక్షా అభియాన్, విద్యాశాఖ అధికారులు ఉషారాణి, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాధినేతల చిత్రపటాల ఏర్పాటు

జలదంకి, జూలై 6: మండలంలోని చినక్రాక గ్రామ సచివాలయంలో ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను శనివారం ఏర్పాటు చేశారు. ఈ చిత్రపటాలను ఎన్డీఏ కూటమి నాయకులు సచివాలయం సిబ్బందికి అందచేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శివారెడ్డి, రవి, రామ్‌చైతన్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

జలదంకి, జూలై 6: మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాలలో భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు వ్యవసాయాధికారిణి బి శైలజ శనివారం పేర్కొన్నారు. రైతులు స్థానిక ఆర్‌ఎస్‌కెలలో వీఏఎలను సంప్రదిస్తే వారు రైతుల భూమికి వెళ్ళి మట్టిని సేకరించి పరీక్షలు జరిపించి భూమిలో ఉన్న లోపాలను రైతులకు చేరవేస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని ఎఓ కోరారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

జలదంకి, జూలై 6: మండలంలోని 17 పంచాయతీలలో పారిశుధ్య, తాగునీటి వనరుల క్లోరినేషన్ పనులు చేపడుతున్నట్లు ఎండిఓ రామచంద్ర శనివారం పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

డీలర్‌ను కఠినంగా శిక్షించాలి

కందుకూరు, జూలై 6: విధుల్లో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయుడిని దుర్భాషలాడిన రేషన్ డీలర్‌ను కఠినంగా శిక్షించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లకుంట మోహనరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భోజనషెడ్ నిర్మాణానికి భూమిపూజ

ఉలవపాడు, జూలై 6: రామాయపట్నం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి షెడ్ నిర్మాణానికి దాత నాగయ్య ప్రతినిధిగా మాజీ సర్పంచ్ కృష్ణ శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సెక్రటరి నాగేశ్వరరావు, పీడీ జీవన్ కుమార్, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత

బిట్రగుంట, జూలై 6: విశ్వనాథరావుపేట పంచాయతీలోని ప్రధాన కాలువలో పూడిక తీత పనులు సర్పంచు గండూరి మంజుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా శనివారం చేపట్టారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని కాలువ ఆక్రమణలు తొలగించి పూడిక తీస్తున్నట్లు సర్పంచు తెలిపారు.

జేబీ కళాశాలలో కూలిన భారీ వృక్షం

కావలి రూరల్, జూలై 6: కావలి పట్టణ జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో ఉన్న భారీ వేప వృక్షం శుక్రవారం రాత్రి వీచిన గాలులకు కూలి రోడ్డుపై పడింది. దీంతో వేపచెట్టు కొమ్మలు పడి విద్యుత్ తీగలు తెగిపోవడంతో పాటు రెండు స్తంభాలు కూడా దెబ్బతిన్నాయి.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

కావలి టౌన్, జూలై 6: భారతదేశ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డులోని ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎమ్మెస్పీ నేతలతో పాటు పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మందా వెంకటేశ్వర్లు, కిరణ్, వెంకటేశ్వర్లు, ఏసురత్నం, వరప్రసాద్ తది తరులు పాల్గొన్నారు.

ఉలవపాడు: మండలంలోని కరేడు గ్రామంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు ఆలూరి కోటేశ్వరరావు, గడ్డం నవీన్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు శ్రీనివాసులు, గోపాల్, ఏలియా, జాలయ్య, క్రాంతిరాజు, ప్రసాద్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ వాసు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిటి భరత్, ఆర్ఐ శ్రీను, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి


కావలిటౌన్: శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, జూలై 6: జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని శనివారం బీజేపీ నేతలు ఆయనకు ఘన నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నే తలు వింతా రంగారెడ్డి, కమల, మాధవి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను అల్లూరు బీజేపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కన్యాపురి శ్రీనివాసులు, తాళ్లూరు నవీన్‌కుమార్, కృష్ణసాయి నాయుడు, కత్తుల కిరణ్, మల్లికార్జున సింగ్, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

లింగసముద్రం, జూలై 6: పెంపుడు కుక్కలకు జూనోసిస్ వ్యాధులు సోకకుండా యాంటీ రేబిస్ టీకాలు వేయించుకోవాలని మండలంలోని లింగసముద్రం, వీఆర్ కోట పశు వైద్యాధికారులు డా. ఆర్ సౌమ్య, డా. వై శ్రీకాంత్ తెలిపారు. శనివారం జూనోసిస్ డే సందర్భంగా కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలంకి ప్రసాద్, అడపా రంగయ్య, కొట్టే శేషాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

బిట్రగుంట,(దగదర్తి) : దగదర్తి మండలం చెన్నూరు పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత రాబీస్ నివారణ టీకా కార్యక్రమం పశు వైద్యాధికారి మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సహాయక పశువైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 8,81,984

వలేటివారిపాలెం, జూలై 6 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 8,81,984 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 6,200, కుంకుమార్చన ద్వారా రూ. 23,360, వివాహముల ద్వారా రూ. 1000, తలనీలాలు ద్వారా రూ. 39,750, వాహనపూజలు ద్వారా రూ. 4,300, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 2,12,700, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 800, రూముఅద్దెలు ద్వారా రూ. 31,120, కవర్లు ద్వారా రూ. 5,400, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,09,585, అన్నదానం ద్వారా రూ. 3,13,503, విరాళముల ద్వారా రూ. 34,226 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలియజేశారు.

ఆకట్టుకున్న కోలాటం

మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటుచేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు కోలాటం తిలకించారు. కాగా, ఆషాడ మాసం కావడంతో భక్తుల సంఖ్య తగ్గింది.

విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడపాలి

కావలి రూరల్, జూలై 6: పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికోసం ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు నడపాలని శనివారం కావలి, బోగోలు మండలాల టీడీపీ నేతలు ఆర్టీసీ డిఎంను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోసూరి వెంకటేశ్వర్లు, ఉప్పాల శ్రీనివాసులు, మక్కి శ్రీహరి, ప్రసాద్, బోగోలు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచెరువు తూముకు చెక్క ఏర్పాటు

జలదంకి, జూలై 6: రెండేళ్ళ నుండి జలదంకి మండలం దాసరి అగ్రహారం ఎర్రచెరువు తూములకు చెక్కలు లేక రైతులు మట్టికట్టలు కట్టుకుని సాగునీటిని కాపాడుకుంటూ వచ్చారు. కొత్తగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో కూటమి నాయకులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోగా తూములకు చెక్కలు ఏర్పాటు చేయించే బాధ్యతను టీడీపీకి చెందిన చుండూరి మాలకొండయ్యకు అప్పగించారు. దీంతో ఆయన శనివారం ఒక తూముకు చెక్కను ఏర్పాటు చేయించడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కుబడిగా సహకార దినోత్సవం

గుడ్లూరు : మండల కేంద్రమైన గుడ్లూరులో సహకార దినోత్సవం మొక్కుబడిగా జరిగింది. గుడ్లూరు వెలుగు కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకూ సాగిన ర్యాలీలో వెలుగు ఏపిఎంతో పాటు ఇతర అధికారులు కూడా పాల్గొనక పోవడంతో విమర్శలు వ్యక్తమయ్యాయి.

తెల్లరాయి తవ్వకాలు చేస్తే చర్యలు : తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వలేటివారిపాలెం, జూలై 6: ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మండలంలోని పోలినేనిచెరువులో 'ఎల్లలు దాటుతున్న అక్రమ తెల్లరాయి' అనే శీర్షికన ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఫారెస్టర్ నాగయ్య, తహసీల్దార్ నాగమల్లేశ్వరావు, ఒంగోలు, నెల్లూరు మైనింగ్ అధికారులు వేర్వేరుగా పోలినేనిచెరువులో అక్రమంగా నిల్వచేసిన తెల్లరాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగమల్లేశ్వరావు మాట్లాడుతూ అక్రమార్కుడికి ఫోన్ చేసి అక్రమ తెల్లరాయి నిల్వలను సీజ్ చేస్తున్నామని, తెల్లరాయిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు